


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 27-06-2026 శనివారం | సంపుటి : 14 | సంచిక :191 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal
Follow us on

# డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



## 'ఈగల్ ఫోర్స్' సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ప్రాణాలు పణంగా పెట్టి డ్రగ్ ముఠాల వేట
- డ్రగ్స్ కేసుల్లో ఎంతటి వారైనా ఉపేక్షించం
- చట్టాలున్నా సమాజంలో పరివర్తన రావాలి
- సినీ నటుల సందేశం యువతకు బలం!

**హైదరాబాద్, జూన్ 26 (వుదయం) :**

క్షణికానందం కోసం విలువైన జీవితాలను డ్రగ్స్ మహమ్మారికి బలిచేసి నాశనం చేసుకోవద్దని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హితవు పలికారు. నగరంలోని శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించిన 'ఈగల్ ఫోర్స్' యాంటీ డ్రగ్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు సినీ ప్రముఖులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. "కంటికి రెప్పలా పెంచుకున్న పిల్లల భవిష్యత్తు డ్రగ్స్ వల్ల అంధకారమవకుండా తల్లిదండ్రులు ఎంతగానో తపిస్తారు. ఈ ప్రజా ప్రభుత్వం కూడా అదే బాధ్యతతో యువతను కాపాడుకునేందుకు కంకణం కట్టుకుంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి, ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటూ డ్రగ్స్ ముఠాల గుట్టు రట్టు చేస్తున్నారు. మాదకద్రవ్యాల కేసుల్లో ఎంతటి వారున్నా ఉపేక్షించే ప్రసక్తే లేదు, చట్టం తన పని తాను చేసుకుపోతుంది'' అని హెచ్చరించారు. డ్రగ్స్ కట్టడి కోసం ఏర్పడిన ఈగల్ ఫోర్స్‌కు ప్రభుత్వం నుంచి అన్ని రకాల వసతులు, పూర్తి స్వేచ్ఛ కల్పించామని, అవసరమైతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణలో పుట్టి పెరగడం అంటేనే ఒక సురక్షితమైన భరోసా అనే వాతావరణాన్ని తీసుకొస్తామన్నారు. కేవలం చట్టాలతోనే మార్పు సాధ్యం కాదని, సమాజంలో పరివర్తన రావాలని.. ఈ విషయంలో సినీ నటులు ఇచ్చే పిలుపు యువతపై బలంగా పనిచేస్తుందని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు.

# వెనెజువెలాలో భూకంప ప్రళయం

**589కి చేరిన మరణాలు**



**కారకాస్ :**
వెనెజువెలాను భారీ భూకంపం అతలాకుతలం చేసింది. ప్రకృతి సృష్టించిన ఈ ప్రళయ విలయంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ.. ఇప్పటి వరకు 589కి చేరడం తీవ్ర విషాదం నింపింది. ఈ భూకంప ధాటికి మూడు వేల మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ అధికారికంగా ప్రకటించారు. భూకంప ప్రభావం అత్యంత తీవ్రంగా ఉన్న 'లా గువేరా' ప్రావిన్సులో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది.మరోవైపు, కుప్పకూలిన వందలాది భవనాల శిథిలాల కింద ఇంకా వేలాది మంది చిక్కుకుపోయి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భూకంపం కారణంగా గల్లంతైన వారి వివరాల కోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించగా.. తమ వారి ఆచూకీ కోసం అందులో ఇప్పటివరకు దాదాపు 50 వేల మంది పేర్లు నమోదు చేసుకోవడం అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒక్క 'లా గువేరా' నగరంలోనే 100కు పైగా బహుళ అంతస్తుల భవనాలు భూమట్టమయ్యాయి. శిథిలాల కింద ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ బృందాలు రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి. వెనెజువెలా సైన్యంతో పాటు రంగంలోకి దిగిన పలు విదేశీ రెస్క్యూ బృందాలు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి.

**భారత్ ఆపన్న హస్తం:**
ఈ ఘోర విపత్కర పరిస్థితుల్లో వెనెజువెలాకు భారతదేశం అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో ఆ దేశానికి తక్షణ సహాయాన్ని ప్రకటించింది. భారీ ఎత్తున అత్యవసర ఔషధాలు, అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు రెస్క్యూ ఆపరేషన్‌లో సహాయపడేందుకు ప్రత్యేక సైనిక (వైద్య) బృందాన్ని భారత్ వెనెజువెలాకు తరలించింది.

# ఆరు గ్యారంటీల పేరుతో నమ్మకద్రోహం

## రూ. 12 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు

- తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరు
- పరిగి బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ విమర్శలు

**పరిగి, జూన్ 26 (వుదయం) :**



వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 12 వేల కోట్లకు చేరాయని, సకాలంలో నిధులు విడుదల చేయక పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు కనీసం లక్షాధికారులను కూడా చేయలేక చేతులెత్తేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తులం బంగారం ఇస్తామని చెప్పిందని.. ఇప్పుడు బంగారం కాదు కదా, కనీసం తులం ఇనుము కూడా ఇచ్చే పరిస్థితి లేదంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నమ్మకద్రోహ పాలనపై క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి పోరాడాలని ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# అటు కేబినెట్.. ఇటు పార్టీ

## యూపీ కార్యవర్గం మార్పు తర్వాత కేంద్ర కేబినెట్‌పై నజర్



**న్యూఢిల్లీ:**
కేంద్ర రాజకీయం మరోసారి వేడెక్కింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో త్వరలోనే కీలక మార్పులు, చేర్పులు జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ వారంలోనే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఊపందుకోనుండటంతో ఢిల్లీ వేదికగా రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మూతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. కేబినెట్ విస్తరణకు సంబంధించిన వివరాలను రాష్ట్రపతికి వివరించడానికే ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వంతో పాటు అటు భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. కొత్త టీమ్‌ను ఎన్నుకునే పనిలో పడ్డ బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్.. పార్టీ పదవుల భర్తీ, మార్పులపై ఇప్పటికే ముమ్మరంగా చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నెలాఖరుకల్లా పార్టీ అంతర్గత నియామకాలు పూర్తి కానున్నాయి. కాగా, కేబినెట్ మార్పుల చేర్పులపై కొందరు కేంద్ర మంత్రులతో కూడా పార్టీ అధ్యక్షుడు ఇదివరకే సంభాషించినట్లు సమాచారం. ఇటీవల ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యూపీ బీజేపీ కార్యవర్గాన్ని మార్చిన అధిష్ఠానం.. ఇప్పుడు కొందరు కేంద్ర మంత్రులకు పార్టీ పరమైన బాధ్యతలను కూడా అప్పగించింది.

**రాజ్యసభ ఎంపీలకు లక్కీ ఛాన్స్?**
ఇటీవలే కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తన పదవికి రాజీనామా చేయడంతో కేంద్ర కేబినెట్‌లో ఖాళీ ఏర్పడింది. ఇదే సమయంలో ఇటీవలే కొత్తగా రాజ్యసభలోకి అడుగుపెట్టిన పలువురు సీనియర్ ఎంపీలకు ఈసారి మోదీ కేబినెట్‌లో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన తుది జాబితాపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో కూడిన బీజేపీ అగ్రనాయకత్వం అత్యంత గోప్యత పాటిస్తోంది.

# 'ఆపరేషన్ సిందూర్'లో వీరమరణం

**న్యూఢిల్లీ:**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా గతేడాది పాకిస్థాన్‌పై భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్'లో వీరమరణం పొందిన అమరజవాన్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఆ ఆరుగురు రణవీరుల పేర్లను 'నేషనల్ వార్ మెమోరియల్' (జాతీయ యుద్ధ స్మారకం) అధికారిక వెబ్‌సైట్‌లో తాజాగా పొందుపరిచారు. ఈ ఆపరేషన్‌లో అమరులైన యోధుల వివరాలను కేంద్రం వెల్లడించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.
భారత సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు జరిగిన ఈ హోరాహోరీ పోరులో ఐదుగురు ఆర్మీ అధికారులతో పాటు ఒక అగ్నివీర్ శత్రువులతో పోరాడుతూ వీరస్వర్గం అలంకరించారు. ఈ అమరవీరుల త్యాగానికి గుర్తుగా దేశ రాజధాని దిల్లీలోని ఇండియా గేట్ సర్కిల్‌లో ఉన్న జాతీయ యుద్ధ స్మారకం వద్ద ప్రత్యేక శిలాఫలకంపై వీరి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు. కాగా, ఈ వీరులలో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ అత్యంత సాహసోపేతమైన పోరాటాన్ని గుర్తించిన కేంద్రం.. ఆయనకు మరణానంతరం దేశ మూడో అత్యున్నత యుద్ధ పురస్కారమైన 'వీర చక్ర'ను ప్రకటించింది. అలాగే, సార్జెంట్ సురేంద్ర కుమార్‌ను 'వాయు సేన మెడల్'తో సత్కరించింది.




# లోహగఢ్ కోట మర్డర్ మిస్టరీ



**పుణె :**
మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన ప్రముఖ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు మిస్టరీ వీడుతోంది. ఈ కేసు దర్యాప్తులో రోజుకో పీడకల లాంటి నిజం వెలుగులోకి వస్తోంది. లోహగఢ్ కోటపై కేతన్‌ను అంతమొందించేలా సియా గోయల్‌ను ఆమె ప్రియుడు చేతన్ తీవ్రంగా ప్రేరేపించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒకవేళ తన మాట వినకపోతే.. గతంలో (జూన్ 14న) కేతన్‌ను చంపేందుకు తాము చేసిన విఫలయత్నాన్ని అందరికీ బయటపెడతానని చేతన్ ఆమెను బ్లాక్‌మెయిల్ చేసినట్లు వెల్లడైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు ప్లాన్ ప్రకారమే సియా తన భర్త కేతన్‌ను లోహగఢ్ కోటలోని ఒక ప్రమాదకరమైన కొండ అంచు వద్దకు తీసుకెళ్లింది. అక్కడకు చేరాక ఆమె తన ప్రియుడు చేతన్‌కు సైగ (సంకేతం) చేసింది. పొంచి ఉన్న చేతన్ వెంటనే వెనక నుంచి వచ్చి కేతన్‌ను లోయలోకి నెట్టేసి హతమార్చాడు. అయితే, సియాను లొంగతీసుకోవడానికి చేతన్ వారిద్దరి వ్యక్తిగత (ప్రైవేట్) ఫొటోలు, కాల్ రికార్డింగులను వాడుకుని బెదిరింపులకు పాల్పడ్డాడా? అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుల ఆర్థిక లావాదేవీలను కనిపెట్టేందుకు వారి బ్యాంక్ ఖాతాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా, హత్యకు ముందు రోజు సియా, చేతన్‌లు ఓ కేఫ్‌లో కూర్చొని కుట్ర పన్నుతున్న దృశ్యాలు సిసిటివి కెమెరాల్లో లభ్యమవడంతో కేసు మరింత బలపడింది. ఈ కేసులో సియా సోదరుడిని కూడా పోలీసులు సుదీర్ఘంగా విచారిస్తున్నారు.

**కూతురిపై తల్లి సంచలన వ్యాఖ్యలు:**
మరోవైపు ఈ ఉదంతంపై సియా తల్లి మీడియా ముందు సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఆ రోజు నా కుమార్తెకు కోటకు వెళ్లడం అస్సలు ఇష్టం లేదు. కేతన్ తల్లే బలవంతం చేయడంతోనే ఆమె ట్రెక్కింగ్‌కు వెళ్లాల్సి వచ్చింది. నా కూతురు ఇంతటి దారుణానికి ఒడిగడుతుందని నేను నమ్మడం లేదు. ఒకవేళ విచారణలో సియానే ఈ పాపానికి ఒడిగట్టినట్లు తేలితే.. ఆమెకు మరణశిక్ష విధించండి. లేదంటే ఏ కోట పైనుంచి అయితే అల్లుడిని నెట్టేశారో.. అదే కోట పైనుంచి నా కూతురిని కూడా కిందకు తోసేయండి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.






## 11:41 సర్వే భూమిలో
# అక్రమంగా మొరం దందా

- మొరం ట్రిప్పర్ అడ్డుకొన
- 8వ వార్డు కౌన్సిలర్ నాగరత్నం గౌడ్

**ఆందోల్ జోగిపేట్,వుదయం :**



శుక్రవారం అనుమతి లేకుండా అక్రమంగా ప్రభుత్వ భూమి 11 41 సర్వే భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ నాగరత్నం గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని అక్రమంగా పర్మిషన్ లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రిప్పర్లని అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు అక్రమంగా మట్టిని తరలిస్తే ఊరుకునేది లేదని గత మూడు నాలుగు రోజుల నుండి ట్రిప్పర్లతో ఇష్టరాజ్యంగా మొరం నడుస్తున్న అధికారులు మైనింగ్ అధికారులు పట్టించుకోకుండా ఎంతవరకు ఏమని అధికారులు ని అడిగితే మాకు ఎటువంటి సమాచారం లేకుండానే మట్టి తరలిస్తున్నారని అధికారులు అంటున్నారు ఏది ఏమైనా ప్రభుత్వానికి గండి కొడుతున్న నాయకులు ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని 8 వార్డ్ కౌన్సిలర్ నాగరత్నం గౌడ్ అన్నారు



## కొహీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ భద్రతపై అవగాహన సదస్సు

**కోహీర్ జూన్ 26 (వుదయం ప్రతినిధి)**

కొహిర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ధన్ ఫౌండేషన్ CFL కోఆర్డినేటర్ సంపూర్ణ ఆధ్వర్యంలో డిజిటల్ భద్రత మరియు ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవల సురక్షిత వినియోగం, UPI లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించే వివిధ మోసపూరిత పద్ధతులను వివరించి, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్ మరియు సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచింది



## మొహరం వేడుకల్లో పాల్గొన్న వెంగళదాస్ మాణిక్య ప్రభు

**కొండాపూర్, జూన్ 26:వు దయం.**

కొండాపూర్ మండలంలోని మారేపల్లి గ్రామంలో నిర్వహించిన మొహరం వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంగళదాస్ మాణిక్య ప్రభు గురువారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొహరం పండుగ త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరమత సహనానికి నిదర్శనంగా ఈ పండుగను అన్ని మతాల ప్రజలు కలిసి జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సోదర భావం పెంపొందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిల్, ఉపసర్పంచ్ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, కుమార్, నరసింహులు, పరమేశ్వర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## 11వ వార్డ్ లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ఓటర్ నమోదు కార్యక్రమం



**హుస్నాబాద్ వుదయం జూన్ (26)**

హుస్నాబాద్ పట్టణం 11 వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ఓటర్ నమోదు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి హాజర్రై, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు తమ ఓటు భద్రతను కాపాడుకోవాలని, ఓటులేని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని బిఎల్ఏ మరియు బిఎల్ఓ సిబ్బందికి సహకరించి తమ యొక్క ఓటు భద్రతను కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మా రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. వి.రమణ,మండల అధ్యక్షులు వెన్నె రాజు, కౌన్సిలర్ పిల్లి తిరుపతి, రమేష్, బత్తుల సరూప, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం డైరెక్టర్ గట్టు సాయి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు బూరుగు కృష్ణ స్వామి, బత్తుల రవీందర్, గట్టు శ్రీనివాస్, పూదరి శ్రీధర్, పూదరి సత్యం, బైరి రవి, పూదరి సత్యం , గడిపే రాజేశ్వర్, జక్కని సాగర్, గట్టు యాదలక్ష్మి, పూదరి స్రవంతి, పూదరి రమ,బైరి రమ, తాళ్లపెల్లి అంజయ్య, బిఎల్ఓతాళ్లపల్లి సంతోషిని, బి ఎల్ ఎ పచ్చిమట్ల ప్రకాష్, ఓటర్స్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు మృతి బాధాకరం

- బౌతికగాయానికి నివాళి అర్పించి కుటుంబీకులను పరామర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**వుదయం న్యూస్, శివ్వంపేట, జూన్ 26.....**



తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు పిల్లి మారుతి మృతి బాధాకరం అని మాజీ మంత్రి,ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన అప్పటి తొలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు పిల్లి మారుతి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి వారి ఇంటికి వెళ్లి బౌతికగాయానికి నివాళి అర్పించి కుటుంబీకులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్రెడ్డి, సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, బీజేపీ మండలాధ్యక్షులు పెద్దపులి రవి, నాయకులు యాదాగౌడ్, చింతస్వామి తదితరులు ఉన్నారు.

## వియత్నాం విద్యార్థులకు కృత్రిమ మేధస్సులో శిక్షణ

- బూట్ క్యాంపు మెంటర్ గా గీతం అధ్యాపకుడు
- రెండు వారాల పాటు మార్గదర్శనం

**పటాన్చెరు (వుదయం):**



వియత్నాంలోని హోచి మిన్ సిటీ, ట్రూంగ్ కావో డాంగ్ వియెన్ డాంగ్ లో జరిగే కృత్రిమ మేధస్సు లాంచ్ ప్యాడ్ బ్యూట్ క్యాంపుకు మెంటర్, రిసోర్స్ పర్సన్ గా సేవలందించేందుకు గీతం అధ్యాపకుడిని ఆహ్వానించారు. గీతం స్కూల్ ఆఫ్ సీఎస్ఈ లోని ఏఐ & డీఎస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ నిరంజన్ అప్పస్వామి, జూన్ 22 నుంచి జూలై 4 వరకు వియత్నాంలో పర్యటిస్తున్నారు. ఈ రెండు వారాల అంతర్జాతీయ విద్యా కార్యక్రమం, గీతం అధ్యాపకుల నైపుణ్యానికి, విద్యా నాయకత్వానికి ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న గుర్తింపును ప్రతిబింబిస్తుంది.వియెన్ డాంగ్ లో డాక్టర్ నిరంజన్ అప్పస్వామి పాల్గొనడం ఇది ఆరవసారి. ఇది ఈ రెండు సంస్థల మధ్య సహకార సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ఆయన అందించిన నైపుణ్యాన్ని, కృషిని గుర్తించి, వియత్నాంలోని విద్యార్థులతో తన జ్ఞానాన్ని, అనుభవాన్ని పంచుకోవడానికి గీతం నాయకత్వం ఆయనను అనుమతించింది.

72 గంటల ఆచరణాత్మక శిక్షణతో కూడిన ఏఐ లాంచ్ ప్యాడ్ బూట్ క్యాంప్, విద్యార్థులకు కృత్రిమ మేధస్సును ప్రాథమిక స్థాయి నుంచి పరిచయం చేయడానికి రూపొందించారు. దీని ద్వారా వారు కోడింగ్ లేదా గణితంలో విస్తృతమైన ముందస్తు పరిజ్ఞానం అవసరం లేకుండానే వాస్తవ ప్రపంచ ఏఐ అప్లికేషన్లను నిర్మించగలుగుతారు. ఓపెన్‌సోర్స్ సాధనాలు, ఆచరణాత్మక అనువర్తనాల ద్వారా అనుభవపూర్వక అభ్యాసానికి ఈ కార్యక్రమం ప్రాధాన్యత ఇస్తుంది.

ఈ బ్యూట్ క్యాంప్ పాఠ్య ప్రణాళిక నాలుగు అభ్యాస దశలుగా విభజించారు. ఏఐ ప్రాథమిక సూత్రాలు (విజువల్ లెర్నింగ్ - కోడింగ్ అవసరం లేదు), పైథాన్, మెషిన్ లెర్నింగ్ ఫండమెంటల్స్, ప్రాక్టికల్ ఏఐ అప్లికేషన్స్, ఏఐ ప్రాజెక్ట్ డెవలప్ మెంట్, డిప్లాయిమెంట్ వంటివి. ఈ మాడ్యూల్స్ ద్వారా, ఈ బూట్ క్యాంపులో పాల్గొనేవారు వాస్తవప్రపంచ ఏఐ పరిష్కారాలను నిర్మించడం, పరీక్షించడం, అమలు చేయడంలో ప్రత్యక్ష అనుభవాన్ని పొందుతారు.డాక్టర్ నిరంజన్ అప్పస్వామి ఒక విశిష్ట సైబర్ సెక్యూరిటీ పరిజ్ఞాన నిపుణుడు, అంతర్జాతీయ విద్యావేత్త, అకడమిక్ సభ్యుడు. ఆయన ఇప్పటివరకు 22 పాఠ్య పుస్తకాలను రచించారు. ప్రస్తుతం ఐ ట్రిపుల్ ఈ సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీ (ఎస్టీసీ)కి కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన లింక్డ్ ఇన్ యొక్క 'ది సైబర్ డిఫెండర్', 'టీచింగ్ బియాండ్ ది టెక్స్ట్ బుక్' న్యూస్ లెటర్లకు సంపాదకుడిగా కూడా ఉన్నారు. అంతేగాక, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బాగా పట్టు సాధించి, ప్రముఖ వక్తగా పేరు పొందారు. డాక్టర్ నిరంజన్ అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యాన్ని గీతం నాయకత్వం ప్రశంసించింది. ఇటువంటి అవకాశాలు అధ్యాపక సభ్యుల నైపుణ్యాన్ని, విజయాలను గుర్తించడమే కాకుండా, విశ్వవిద్యాలయం యొక్క ప్రపంచవ్యాప్త గుర్తింపును, విద్యా ప్రతిష్టను కూడా పెంచుతాయని అభిలషిస్తున్నారు. అంతర్జాతీయ సహకారాలను పెంపొందించడానికి, బోధన, పరిశోధన, ఆవిష్కరణలలో శ్రేష్ఠతను ప్రోత్సహించడానికి గీతం నిబద్ధతను ఇది తెలియజేస్తోంది.

## ఆహార ధరలను వెంటనే తగ్గించాలి

- మెట్టు శ్రీధర్ డిమాండ్

**పటాన్చెరు (వుదయం):**



కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ (Commercial LPG) సిలిండర్ల సరఫరాపై ఉన్న పరిమితులను తొలగించిన నేపథ్యంలో, హోటళ్లు మరియు రెస్టారెంట్లు టిఫిన్ సెంటర్ల యజమానులు గతంలో సిలిండర్ల కొరత, అధిక ధరల కారణంగా పెంచిన ఆహార పదార్థాల ధరలను వెంటనే తగ్గించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి **మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.** సిలిండర్ల కొరత ఉన్న సమయంలో వినియోగదారులపై అదనపు భారం మోపుతూ టిఫిన్లు, భోజనాలు మరియు ఇతర ఆహార పదార్థాల ధరలను పెంచిన హోటళ్లు, ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ అదే అధిక ధరలను కొనసాగించడం సమంజసం కాదన్నారు.ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హోటల్ యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో వ్యవహరించి ఆహార ధరలను తగ్గించాలని కోరారు.అలాగే, రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికార యంత్రాంగం హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార ధరలపై పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు న్యాయమైన ధరలకు నాణ్యమైన ఆహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మెట్టు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.



## అంత్రక్రియలు పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్

**యాలాల జూన్ 26 (వుధయ ప్రతినిధి):-**

యాలాల మండలం కమల్పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి తండ్రి రఘునాథ్ రెడ్డి శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు ముదిరాజ్, అంతక్రియలో పాల్గొన్నారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మి కాంత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి యువకుడు మృతి

**సదశివ పేట్. వుదయం**



సదాశివపేట మండలం ఇశ్రాతాబాద్ గ్రామ శివారులో విషాద ఘటన చోటు చేసుకుంది. వెంకటాపురం గ్రామానికి చెందిన అనిల్ (23) తన అల్లుడితో కలిసి పొలానికి వెళ్లి పశువులు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో అకస్మాత్తుగా పిడుగు పడటంతో అనిల్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.అతనితో ఉన్న బాలుడు అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో వెంకటాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## ఓటరు జాబితా ప్రక్షాళన వేగవంతం చేయాలి



- సబ్ కలెక్టర్ ఉమా హారతి
- శంకరంపేటలో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్
- ప్రతి అర్హ ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందించాలని ఆదేశం
- పారదర్శకంగా, గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచన

**వుదయం పెద్ద శంకరంపేట ప్రతినిధి జూన్ 26**

నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి శంకరంపేట మండలంలోని పోలింగ్ కేంద్రం నంబర్133ను సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రతి అర్హ ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే నిర్ణీత గడువులోగా ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు..

## భక్తికి తలవంచే అద్భుత మూర్తి సాయిబాబా

- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దగుని జిన్నారం శివకుమార్ గౌడ్....



మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో గూడూరు గ్రామ వాస్తవ్యులు పెద్దగోని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు నిర్మించి ప్రతిష్ఠించిన దేవతామూర్తులు శ్రీ సాయిబాబా గూర్చి ఆయన వుదయం దినపత్రిక ద్వారా వివరిస్తూ.ప్రతి మనిషిలోనూ నిద్రాణంగా ఉండే భక్తిని సాధనతో మెప్పించి మేల్కొలిపి అద్భుతాలు చేయించగల అద్వితీయ మూర్తి శ్రీ సాయి. శ్రీ సాయి అహంకారాన్ని దునుమాడే కత్తి, దుర్లక్షణాలను తుదముట్టించే చైతన్య దీప్తి, భక్తికి, శ్రద్ధకు తలవంచే అద్భుత మూర్తి.'అహంకారానికి, గర్వానికి శ్రీ సాయి ఎంత దూరంలో ఉంటారో భక్తికి, శ్రద్ధకు అంత దగ్గరగా ఉంటారు. మానవ జన్మను పునీతం చేయడంలో భక్తికి మించిన సాధన లేదు. రోజువారీ వ్యవహారాల్లో తలమునకలై ఉండే వారు కూడా క్షణం తీరిక చేసుకుని సాయి నామ స్మరణ చేస్తే చాలు బాబా అపారమైన వాత్సల్యాన్ని అమృతంలా కురిపిస్తారు.షిరిడీ కేవలం ఒక ఊరు మాత్రమే కాదు. మన మనసుల్లో గూడుకట్టుకున్న అజ్ఞానమనే చీకటిని పారద్రోలే దివిటీ. పూలగుత్తిలో పేరుకున్న మకరందంలా అక్కడ సాయితత్వం ప్రసరిస్తుంటుంది. అక్కడ అడుగు పెట్టగానే మందబుద్ధులకు చైతన్యం కలుగుతుంది. షిరిడీ అంటే మన చింతలు తీర్చే చింతామణి. కోరిన కోరికలు తీర్చే కల్పవృక్షము. విద్య, కీర్తి, ధనం అంతిమంగా అఖండ జ్ఞానాన్ని ప్రసాదించే అక్షయపాత్ర.జగత్తులో అనేకత్వం వెనుక ఏకత్వ శక్తిగా ఉన్నది షిరిడీ సాయినాథుడే. భక్తితో కొలిస్తే అనేకత్వమనే అజ్ఞానపు తెరతొలగి అఖండమై వెలుగొందుతున్న తన ఏకత్వాల రూపును చూపి శ్రీ సాయి మనల్ని ముక్తుల్ని చేస్తారు.

## మొహరంలో ఉద్రిక్తత ఇరువర్గాలకు నచ్చ చెప్పిన సీఐ భీమ్ కుమార్

- మొహర్రం అంటే పండుగ కాదు.. ఒక పవిత్ర మాసం!అని సిఐ భీమ్ కుమార్ చెప్పారు

**ఊర్కొండ న్యూస్ 26 వుదయం ప్రతినిధి**



నాగర్ కర్నూల్ జిల్లా ఉరకొండ మండలం ఈరోజు ఊరుకొండ పేట గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత మొహరం వేడుకల్లో. ఇరువర్గాల మధ్యలో సవారిలు. గుర్రాల విషయంలో ఇరువర్గాల మధ్య విభేదాలు రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది . స్థానిక ఎస్సై రమాదేవి. కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్. ఇరు వర్గాలకు పిలిచి నచ్చ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సామరస్యంగా సాగే పండుగ. ఘర్షణలకు లేకుండా ప్రశాంతంగా. సంతోషాల మధ్య. ఆనందంగా. మొహరం వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఇకపైన ఎలాంటి ఘర్షణలు జరిగిన వాళ్లపైన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఇరు వర్గాలకు చెప్పడం జరిగింది సిఐ భీమ్ కుమార్ తెలిపారు. మొహరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు

## సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం






- రాష్ట్రవ్యాప్తంగా హాజరైన గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్

**వుదయం ప్రతినిధి**

ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా రూరల్ రీజినల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ సెక్రెటరీ జనరల్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల హక్కులు సంక్షేమం కోసం పోరాటంలో ముందు ఉండాలి. ఉద్యోగులకు పెన్షన్ సమానత్వం నియామకాలు సరిపడా మానవ వనరులు ప్రమోషన్ విధానాల సవరణ మెరుగైన సేవ నిబంధనలు దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్... దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి నేషనల్ రూరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు ఏర్పాటు చేయాలని డిమాండ్. అలానే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను బలోపేతం చేయాలని కోరారు.

## రోడ్డు ఉంది.. దాటేందుకు మార్గం లేదు!

- దౌల్తాబాద్ 8వ వార్డులో ప్రజలకు ఇబ్బందులు.
- డ్రైనేజీపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజలు.

**దౌల్తాబాద్, జూన్ 26 (వుదయం):**





దౌల్తాబాద్ మండల కేంద్రంలోని 8వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం బయటపడింది. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ డ్రైనేజీ కాలువపై వంతెన (బ్రిడ్జి) నిర్మించకుండా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వార్డులోని ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మించిన, డ్రైనేజీ కాలువ దాటేందుకు అవసరమైన వంతెన నిర్మాణాన్ని విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాదచారులు, వృద్ధులు, చిన్నారులు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజా ధనం వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలంటే డ్రైనేజీపై వెంటనే వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుబ్బాకలో స్కాలర్షిప్ టెస్ట్

**దుబ్బాక, వుదయం, (జూన్ 26):**

మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో ఎస్సై సతీష్ చేతుల మీదుగా అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహణ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అఖిల రాజ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అస్క స్వామి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు, నిరుద్యోగులకు ఉచితంగా ఫ్రీ కోచింగ్, ఉచిత మెటీరియల్ అందిస్తూ లక్ష్యసాధకులుగా తయారు తీర్చిదిద్దడానికి ఆదివారం దుబ్బాక వాగ్దేవి జూనియర్ కాలేజ్ లో నిర్వహించే స్కాలర్షిప్ టెస్ట్ కు బార్ కోడ్ స్కాన్ ద్వారా తమ పేరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఆర్థిక సాయంతో పాటు ఫ్రీ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గొల్ల విజయ్ కుమార్, పూస రాజు, అఖిల రాజ్ ఫౌండేషన్ నాయకులు ధర్మారం రాజు, అల్లిబిల్లి రాజు, ఎద్దు నరేందర్, నక్క రాజం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పాలన వైఫల్యాలపై సమాధానం చెప్పాలి

- ఎంపీ రఘునందన్‌రావుకు కాంగ్రెస్ నేత సవాల్

**దుబ్బాక, వుదయం (జూన్ 26):**



ఎమర్జెన్సీ గురించి పదేపదే మాట్లాడే బీజేపీ నేతలు తమ 12 ఏళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్ ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏఎంసి వైస్ చైర్మన్ చెన్నై భూపాల్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు కోరడం న్యాయమైన డిమాండ్ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల్లో మంత్రులు నైతిక బాధ్యతతో రాజీనామాలు చేసిన సందర్భాలు ఉన్నాయని, కానీ బీజేపీ పాలనలో జవాబుదారీతనం కనిపించడం లేదని విమర్శించారు.దేశంలో రైలు, విమాన ప్రమాదాలు, ఉగ్రవాద దాడులు జరిగినా సంబంధిత కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించడం లేదని ఆరోపించారు. ప్రచారంలో మాత్రమే గొప్పలు చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం వైఫల్యాల విషయంలో బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాలుగా స్వతంత్రంగా విలేకరుల సమావేశం నిర్వహించి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ప్రజల ముందు జవాబుదారీతనం చూపకుండా కేవలం ప్రచార రాజకీయాలకే పరిమితమయ్యారని విమర్శించారు.కాంగ్రెస్‌ను విమర్శించే ముందు ఎంపీ రఘునందన్ రావు బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర విద్యాశాఖ మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కూడా నీట్ పేపర్ లీక్, పెరుగుతున్న ప్రమాదాలు, ఉగ్రవాద ఘటనలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని పాతూరి వెంకటస్వామి గౌడ్ డిమాండ్ చేశారు.




"తెలంగాణలోని ప్రయివేటు కాళాశాలల యాజమాన్యాలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఆయా కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను పాటించటం లేదు. ఆ మేనేజ్‌మెంట్లకు మౌలిక సదుపాయాల కల్పన అసలు శ్రద్ధే లేదు. అందువల్ల ప్రభుత్వం ఆ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలి. అప్పుడే అవి దారిలోకి వస్తాయి...ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను స్వాగతిస్తున్నా. అయితే, ప్రభుత్వ చెల్లింపులు, విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్ల కోసం ఆరాటపడే యాజమాన్యాలు, నాణ్యమైన విద్యను, కనీస వసతులను అందించడంలో విఫలమవుతున్నాయి. ఫీజులు వసూలు చేసే హక్కు ప్రయివేటు యాజమాన్యాలకు ఉన్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా వారు విధిగా నెరవేర్చాలి..."

* –విజయశాంతి, సినీ నటి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ

## వేమన పద్యం

మిరపగింజచూడ మీద నల్లగనుండు
కొరికిచూడు లోనచురుకు మనును
సజ్జను లగునారి సారమిట్లుండురా
విశ్వదాభిరామ! వినురవేమ!



## సంపాదకీయం

# నిందితులకు కిరీటాలా...?

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించడం పౌరుల హక్కు. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయడం ప్రతిపక్షాల బాధ్యత. కానీ, నేడు దేశంలో ప్రశ్న అడిగిన వారిపై దాడి చేయడం, దాడిచేసిన వారిని వీరులుగా కీర్తించడం, నిందితులకు పూలదండలు వేసి ఊరేగింపులు నిర్వహించడం రోజు రోజుకూ దేశంలో ఒక కొత్త రాజకీయ సంస్కృతిగా మారుతోంది. నీట్ పేపర్ లీకేజీ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన, కేంద్ర విద్యామంత్రి రాజీనామా డిమాండ్, పలు రాష్ట్రాల్లో యువత నిరసనలు అధికార పార్టీని ఆద్యంతం కలవరపెట్టిన మాట నిజం. దీన్ని జీర్ణించు కోలేని కాషాయ మూక ఈ నెల పదిహేనున రాజస్థాన్‌లోని జైపూర్‌లో సీజేపీ చేపట్టిన ప్రదర్శనలో వీరంగం సృష్టించింది. అధ్యక్షుడు అభిజిత్ దీప్కేపై దాడికి దిగింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నకు జవాబు చెప్పాల్సిన చోట భౌతికదాడిని ఆయుధంగా ఎంచుకోవడం ప్రమాద కరం.పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. కానీ అసలు వివాదం అక్కడితో ఆగలేదు. బెయిల్‌పై విడుదలైన నిందితులకు పూల దండలు వేసి స్వాగతించడం, మోటార్‌సైకిల్ ర్యాలీలు నిర్వహించడం, 'జై శ్రీరామ్', 'భారత్ మాతాకీ జై', 'హిందూ ఏక్తా జిందాబాద్' వంటి నినాదాలతో వారిని వీరులుగా చిత్రీకరించడం దేశవ్యాప్తంగా విమర్శలకు దారితీసింది. బెయిల్ అనేది న్యాయ ప్రక్రియలో ఒక భాగం మాత్రమే. అది నిర్దోషిత్వానికి ధ్రువీకరణ కాదు. అయినప్పటికీ నిందితులను సమాజ రక్షకులుగా, మత యోధులుగా ప్రదర్శించడం న్యాయవ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి, బాధితులకు అవమానం. మరింత ప్రమాదకర విషయం ఏమిటంటే, ఈ ఘటనలో నేరారోపణలపై కాకుండా నిందితుల మతపరమైన గుర్తింపుపై ప్రచారం జరగడం. ఇదొక్కటే కాదు, గత దశాబ్ద కాలంగా ఇలాంటి దృశ్యాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడి, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న దోషులు విడుదలైనప్పుడు వారికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికిన ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కొందరు వారికి మిఠాయిలు పంచి సన్మానించారు. 'హత్రాస్' ఘటనలోనూ బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేసినవారికంటే నిందితుల పక్షాన నిలిచిన శక్తులు ఎక్కువగా కనిపించాయి. లైంగిక, హత్య వంటి తీవ్రమైన నేరాలకు సంబంధించి కూడా నిందితులను సామాజిక హీరోలుగా మలిచే ప్రయత్నాలు జరిగాయి.

అదేవిధంగా ఢిల్లీ అల్లర్ల కేసులు, మత ఘర్షణల కేసులు, గోరక్షణ పేరిట జరిగిన దాడులు, మైనార్టీలపై హింసకు సంబంధించిన అనేక సందర్భాల్లోనూ నిందితులకు సంఘీభావ ర్యాలీలు నిర్వహించడం దేశం చూసింది. ఇవన్నీ బీజేపీ పాలిత రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో తరచూ వెలుగు చూస్తున్నవి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని సమాజంలో ఆదర్శంగా నిలబెట్టే ఈ సంస్కృతి నేరాన్ని సాధారణీకరించడమే తప్ప వేరేకాదు. అయితే, ఈ పరిస్థితి యాదృచ్ఛికంగా ఏర్పడలేదు. బీజేపీ పాలనలో రాజకీయ చర్చల స్థాయిలో వచ్చిన మార్పుల ఫలితమిది. అధికారాన్ని ప్రశ్నించిన వారిని 'దేశద్రోహులు', అర్బన్ నక్సల్స్', 'పాకిస్థాన్ ఏజెంట్లు', 'హిందూ వ్యతిరేకులు'గా ముద్ర వేయడం వ్యూహాత్మకంగా సాగుతోంది. విద్యార్థులు ప్రశ్నించినా, జర్నలిస్టులు విమర్శించినా, ప్రతిపక్షాలు నిలదీసినా దేశద్రోహం అన్న భావజాలం దించబడింది. ప్రజాస్వామ్యంలో అసమ్మతి సహజమనే సూత్రాన్ని పక్కనబెట్టి, విభేదాన్ని శత్రుత్వంగా చిత్రీకరించడం వల్లే ఇలాంటి హింసాత్మక వాతావరణం బలపడుతోంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి అభిప్రాయ స్వేచ్ఛను హామీ ఇస్తుంది. ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు కూడా అదే రాజ్యాంగం కల్పించింది. కానీ ప్రశ్నించిన వారిపై దాడులు జరగడం, దాడిచేసిన వారిని కీర్తించడం, వారి విడుదలను విజయోత్సవంగా మార్చడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. న్యాయస్థానాలు ఇంకా విచారణ కొనసాగిస్తుండగానే నిందితులను మతం, జాతి, జాతీయత పేరుతో కొలవడం సమాజాన్ని మరింత ప్రమాద కర దిశలో నడిపిస్తుంది. ఇక్కడ మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. 'జై శ్రీరామ్', 'భారత్ మాతాకీ జై' వంటి నినాదాలు నిజంగా దేశభక్తి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలా? లేక నేరారోప

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఆర్థికం అస్తవ్యస్తం...

"ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ"గా కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రచార ఆర్భాటం చేస్తున్నా, అదే ప్రభుత్వం తరఫున కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మాత్రం మరో వాస్తవాన్ని బయటపెట్టాయి. విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి, ముడి చమురు ధరల అనిశ్చితి, ఎరువుల వ్యయం పెరుగుదల, వర్షాభావం ముప్పు వంటి అంశాలపై ఆమె వ్యక్తం చేసిన ఆందోళన దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న

*ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మాత్రం మరో వాస్తవాన్ని బయట పెట్టాయి. విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి, ముడి చమురు ధరల అనిశ్చితి, ఎరువుల వ్యయం పెరుగుదల, వర్షాభావం ముప్పు వంటి అంశాలపై ఆమె వ్యక్తం చేసిన ఆందోళన దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల తీవ్రతను తెలియజేస్తోంది. అంతకంటే ముఖ్యంగా విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటామని ప్రకటించడం దేశీయ ఆర్థిక పునాదుల బలహీనతను పరోక్షంగా అంగీకరించినట్టే. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే విదేశీ పెట్టుబడుల కోసం ఇంత ఆత్రుత అవసరం ఉండదు.*

సవాళ్ల తీవ్రతను తెలియజేస్తోంది. అంతకంటే ముఖ్యంగా విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటామని ప్రకటించడం దేశీయ ఆర్థిక పునాదుల బలహీనతను పరోక్షంగా అంగీకరించినట్టే. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే విదేశీ పెట్టుబడుల కోసం ఇంత ఆత్రుత అవసరం ఉండదు. దేశీయ డిమాండ్, ప్రజల కొనుగోలు శక్తి, ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ఉత్పత్తి, చిన్న పరిశ్రమల వృద్ధి ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారాలు. కానీ ప్రస్తుతం ఇవన్నీ ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్నాయి. జీడీపీ వృద్ధి గణాంకాలు పెరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ ప్రజల జీవితాల్లో ఆ అభివృద్ధి కనిపించడం లేదు. నిరుద్యోగం పెరుగుతోంది. వేతనాల పెరుగుదల నిలిచిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం తగ్గుతోంది. మధ్యతరగతి కుటుంబాలు విద్య, వైద్యం, గృహ వ్యయాల భారంతో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణం గత పదేళ్లుగా కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలే. నోట్ల రద్దు, అవ్యవస్థిత జీఎస్‌టీ అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ పన్నుల తగ్గింపు వంటి నిర్ణయాలు పెద్ద వ్యాపార వర్గాలకు లాభం చేకూర్చినా, చిన్న పరిశ్రమలు, అసంఘటిత రంగం, స్వయం ఉపాధి రంగాలను తీవ్రంగా దెబ్బతీశాయి. కోట్లాది మంది ఆధారపడే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. ప్రస్తుతం కేంద్రం విదేశీ పెట్టుబడు లను అభివృద్ధికి ప్రధాన ఇంధనంగా చూపిస్తోంది. విదేశీ మూల ధనం అవసరం లేదని ఎవరూ చెప్పడం లేదు. కానీ దేశీయ ఆర్థిక శక్తిని పక్కనబెట్టి విదేశీ పెట్టుబడులపైనే ఆధారపడటం ప్రమాద కరం. విదేశీ కార్పొరేట్లు లాభాల కోసం వస్తాయి. లాభాలు కనిపించక పోతే వెనక్కి వెళ్లిపోతాయి. ప్రపంచ మార్కెట్‌లో చిన్న మార్పు వచ్చినా పెట్టుబడుల ప్రవాహం ఆగిపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో దేశీయ ఉత్పత్తి, దేశీయ మార్కెట్, ప్రజల కొనుగోలు శక్తి బలహీనంగా ఉంటే ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలోకి జారిపోతుంది. ఇక దేశంలో సంపద పంపిణీ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. కొద్దిమంది కార్పొరేట్ సమూహాల చేతుల్లో ఆర్థిక శక్తి కేంద్రీకృతమవుతోంది. పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్, గనులు, మౌలిక సదుపాయాలు,



టెలికాం వంటి కీలక రంగాల్లో పెద్ద కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగింది. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సమూహాల సంపద అపూర్వ స్థాయిలో పెరుగుతుంటే, మరోవైపు కోట్లాది మంది ప్రజలు ఉపాధి, ఆదాయం కోసం పోరాడుతున్నారు. ఈ అసమానతలు పెరుగుతున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థలో అంతర్గత బలహీనతలు కూడా పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తరచూ భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని చెబుతోంది. కానీ ప్రజలకు అసలు ప్రశ్న వేరేది. జీడీపీ పెరిగితే ఉద్యోగాలు పెరిగాయా? రైతుల ఆదాయం రెట్టింపైందా? యువతకు ఉపాధి లభించిందా? మహిళల ఉపాధి పరిస్థితి మెరుగుపడిందా? ఆకలి, పేదరికం తగ్గాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది. గణాంకాల్లో కనిపించే అభివృద్ధి ప్రజల జీవితాల్లో కనిపించకపోతే ఆ గొప్పలు కాగితాలకే పరిమితం అవుతాయి. నిర్మలా సీతారామన్ ప్రస్తావించిన చమురు ధరలు, విదేశీ మారక నిల్వలు, వర్షాభావం వంటి అంశాలు నిజంగానే సవాళ్లే. కానీ వాటికంటే పెద్ద సవాలు దేశీయ డిమాండ్ బలహీనత. ప్రజల చేతుల్లో డబ్బు లేకపోతే మార్కెట్ కదలదు. మార్కెట్ కదలకపోతే పెట్టుబడులు రావు. పెట్టుబడులు లేకపోతే ఉపాధి పెరగదు. ఈ చక్రాన్ని విరగదీయకుండా విదేశీ మూలధనంపై ఆశలు పెట్టుకోవడం సమస్యకు తాత్కాలిక పరిష్కారం మాత్రమే. ఇప్పుడు దేశానికి అవసరమైంది కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు కాదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధానాలు. వ్యవసాయానికి గిట్టుబాటు, చిన్న పరిశ్రమలకు రక్షణ, ప్రభుత్వ రంగ బలోపేతం, యువతకు ఉపాధి, ప్రజా పెట్టుబడుల విస్తరణ. అభివృద్ధి ఫలాలు కొద్దిమందికి కాకుండా సమాజంలోని మెజారిటీ ప్రజలకు చేరినప్పుడే ఆర్థిక వ్యవస్థ నిజంగా బలపడుతుంది.

# ఈ పాపం ఎవరిది..?

ఎవ్వరూ ఊహించని విధంగా వ్యవహరిస్తూ ఉండటం, పార్టీ సీనియర్ నేతలకు సహితం అందుబాటులో ఉండకపోవడంతో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్ల కాంగ్రెస్ పార్టీలో ఓ విధమైన అసంతృప్తి పెరుగుతుంది. కీలక సమయాలలో ఆయన కన్పించక పోవడం పట్ల అసహనం వ్యక్తం అవుతుంది. ఆయన 'అసమర్థత' కారణంగానే ప్రధాని నరేంద్ర మోదీ తిరుగులేని నాయకుడిగా దేశ రాజకీయాలపై ఆధిపత్యం వహిస్తున్నారని పలువురు బహిరంగంగానే వాఖ్యానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అందరి దృష్టి ప్రియాంక గాంధీపై పడుతుంది. ఆమెను ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదే అన్నట్లు పలువురు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు ఆమె తన రాజకీయ సామర్థ్యాన్ని ఎక్కడా నిరుపిందుకోలేక పోయారు. ఆమెకు పార్టీ అప్పచెప్పిన ఏ పనిలో కూడా విజయం సాధించలేకపోయారు. ఒక విధంగా 'సూట్ బూట్ కి సర్కార్', 'గబ్బర్ సింగ్ టాక్స్' వంటి పదజాలం నుండి తాజాగా అమెరికాకు ప్రధాని మోదీ లో లొంగిపోయారనే వరకు మోదీ ప్రభుత్వానికి నిత్యం 'గుదిబండ'గా మారారు.

మరే ఇతర ప్రతిపక్ష నేత కూడా రాహుల్ గాంధీ మాదిరిగా రఫేల్ ఒప్పందం నుండి అమెరికాతో వాణిజ్య ఒప్పందం, చైనా సరిహద్దుల నుండి పాకిస్థాన్ తో కాల్పుల విరమణ వరకు ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేయలేదని చెప్పవచ్చు. తాజాగా అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఇన్ ఛార్జ్ గా బాధ్యతలు చేపట్టిన ప్రియాంక గాంధీ ఏమిచేస్తారనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఒక నెల వ్యవధిలోనే అస్సాం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు – లోక్‌సభ ఎంపీ ప్రద్యుత్ బోర్దోలోయ్, రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు భూపేన్ బోరా బీజేపీలో చేరడం, ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ చేస్తున్న ప్రచారాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రియాంక గాంధీ వాద్రా నాయకత్వాన్ని సహితం సవాల్ చేస్తున్నది. ప్రద్యుత్ బోర్దోలోయ్ బీజేపీలో చేసిన




మరుసటి రోజు ఆయన కుమారుడు ప్రతీక్, మార్గెరిటా నియోజకవర్గం నుండి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడికి లేఖ రాశారు. బిజెపి ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఆయన దిస్పూర్ అభ్యర్థి. అస్సాం కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు దివ్యజ్యోతి తాలూక్దార్ కూడా పార్టీకి రాజీనామా చేశారు. అస్సాంలో పార్టీ వ్యవహారాల్లో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికను పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది మే నెలలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన లోక్‌సభ ఎంపీ గౌరవ్ గోగోయ్‌ను అస్సాం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడం, అసెంబ్లీ ఎన్నికలలో ప్రియాంకకు కీలక పాత్ర కల్పించడం వంటి చర్యలను, దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న బీజేపీ నుండి రాష్ట్రాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోందనడానికి సంకేతాలుగా చెప్పవచ్చు. అయితే, గోగోయ్ నియామకం కాంగ్రెస్ శ్రేణులలో అసంతృప్తికి కారణమవుతోంది. 2015లో పార్టీని వీడిన మాజీ కాంగ్రెస్ నాయకుడు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఫిరాయింపుల వెనుక సూత్రధారి అన్నది బహిరంగ రహస్యమే అయినప్పటికీ, రాష్ట్ర విభాగంలో కుళ్లు చాలా లోతుగా పాతుకుపోయిందని పార్టీ నాయకులు అంగీకరిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార నిర్వహణ రెండింటిలోనూ గోగోయ్ 'ఏకపక్షంగా' వ్యవహరిస్తున్నారని చాలా మంది నాయకులు ఆరోపిస్తున్నారు. "అతను (గౌరవ్) ఎవరినీ నమ్మడు. ప్రతి ఒక్కరూ హిమంత ఏజెంట్లే అని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు నిర్వహించే బాధ్యతను పార్టీ (రాజకీయ వ్యూహకర్త) సునీల్ కనుగోలుకు అప్పగించినప్పటికీ, గౌరవ్ తన సొంత సర్వే కోసం మరో ఏజెన్సీని రంగంలోకి దించినట్లు మాకు తెలిసింది. అంతేకాక, అభ్యర్థుల ఎంపిక కోసం డబ్బు చేతులు మారిందనే నిరాధారమైన వదంతులు కూడా ఉన్నాయి," అని ఒక ఏఐసీసీ నాయకుడు తెలిపారు."వేచి చూడండి, త్వరలోనే అసోం కాంగ్రెస్‌లో ఒక్క హిందూ నాయకుడు కూడా మిగలడు; ఎందుకంటే ఆ పార్టీ అనుసరిస్తున్న 'సంతుష్టీకరణ' విధానం పట్ల వారు విసిగిపోయారు. అంతేకాక ఈ విధానం అసోం జనాభా స్వరూపంపై చూపే ప్రభావం గురించి వారు ఆందోళన చెందుతున్నారు" అంటూ ముఖ్యమంత్రి శర్మ నేరుగా గాంధీ కుటుంబాన్నే సవాల్ చేసేవిధంగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ నుండి జరిగిన ఉన్నత స్థాయి ఫిరాయింపులు, ఉత్తర ప్రదేశ్ వెలుపల మరో రాష్ట్రంలో ఎన్నికలను నిర్వహించడానికి ప్రియాంక చేసిన తొలి ప్రయత్నంపై నీలినీడలు కమ్మేలా చేశాయి. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, రాహుల్‌ల వెనుక సంవత్సరాల తరబడి నిశ్శబ్ద తెరవెనుక శక్తిగా పనిచేసిన తర్వాత, 2019 లోక్‌సభ ఎన్నికలకు తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీగా ఆమె ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణలో చేసిన మొదటి ప్రయత్నం ఘోరంగా విఫలమైంది. యూపీలోని 80 స్థానాలకు గాను కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానాన్ని మాత్రమే గెలుచుకోగలిగింది. అది కూడా రాయ్‌బరేలీలో సోనియా. అలాగే, తమ కుటుంబ కంచుకోట అయిన అమేథీలో రాహుల్ కూడా ఓడిపోయారు. మూడేళ్ల తర్వాత యూపీ అసెంబ్లీ ఎన్నికలలో పూర్తిస్థాయి ఎన్నికల నిర్వాహకురాలిగా, ప్రచారకర్తగా ప్రియాంక చేసిన మొదటి ప్రయత్నంలో కూడా విఫలమయ్యారు. "నేను అమ్మాయిని, పోరాడగలను" (లడ్కీ హున్, లడ్ సక్తీ హున్) అనే నినాదంతో మహిళా ప్రాధాన్య ప్రచారం చేసినప్పటికీ, రాష్ట్రంలోని 403 స్థానాలకు గాను పార్టీ కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగింది. ఇప్పుడు అస్సాంలో ఆమె ఒక పూర్తిస్థాయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. బోర్దోలోయ్ విషయంలో జరగబోయేది స్పష్టంగా తెలిసినప్పటికీ, కాంగ్రెస్‌తో దశాబ్దాల అనుబంధం కారణంగా ఆయన పార్టీ మారరని ప్రియాంక, కాంగ్రెస్ పార్టీ ఆశించాయి. నాగావ్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన, అస్సాంలో గతంలో తరుణ్ గోగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలలో మూడుసార్లు మంత్రిగా పనిచేశారు. కానీ, పరిస్థితులు అంతకంటే చాలా క్లిష్టంగా ఉన్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు నెలల క్రితం అస్సాం కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశంలో, గౌరవ్ గోగోయ్ ఖచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారని, తాను, ఇతర సీనియర్ నాయకులు ఆయన కింద పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని బోర్దోలోయ్ చెప్పి ఏఐసీసీ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులను ఆశ్చర్యపరిచారు. కానీ, గోగోయ్ పనితీరు పట్ల బోరా, బోర్దోలోయ్ ఇద్దరూ అసంతృప్తిగా ఉన్నారు.

"బోర్దోలోయ్ ఏపీసీసీ అధ్యక్ష, ముఖ్యమంత్రి పదవుల రేసులో లేరని చెబుతున్నప్పటికీ, గోగోయ్‌ను వాస్తవంగా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలన్న ఏఐసీసీ నిర్ణయం అసంతృప్తిని రేకెత్తించిందన్నది విస్మరించలేని వాస్తవం. తరుణ్ గోగోయ్‌కు 80 ఏళ్లు పైబడ్డాయి. గౌరవ్‌కు ఇంకా 40 ఏళ్లే. 50, 60 ఏళ్ల వయసులో ఉన్న నాయకుల తరం ఒకటి ఉంది, వారు నిరాశకు గురయ్యారు," అని ఒక రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల కోసం బోరా పార్టీ ప్రచార కమిటీకి అధిపతిగా, బోర్దోలోయ్ మేనిఫెస్టో ప్యానెల్‌కు నేతృత్వం వహించడం కాంగ్రెస్‌లో మరింత ఆందోళనను రేకెత్తించింది. "మేము మా మేనిఫెస్టోను ఏ ముఖంతో విడుదల చేస్తాం? మా ప్రచార కమిటీ అధిపతి బీజేపీలో చేరిన నెల రోజులకే, మా మేనిఫెస్టో కమిటీ చైర్మన్ స్వయంగా అవతలి పక్షంలోకి వెళ్లిపోయారు," అని ఒక కాంగ్రెస్ నాయకుడు ఆందోళన వ్యక్తం చేశారు. బోర్దోలోయ్ నిష్క్రమణకు తక్షణ కారణం, ఆయన నాగావ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే లహరిఘాట్ స్థానంలో అభ్యర్థి ఎంపిక విషయంలో తలెత్తిన విషయమే.



# "తొలి హైందవ సామ్రాజ్య నిర్మాత శివాజీ"

పుణ్యభూమి అయిన భారతావనిలో అనేకానేక దేశ భక్తులు తమ జీవితమే ధర్మంగా, ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యులైనారు. వారిలో నిత్య స్మరణీయుడు శివాజీ. శాలివాహన శకం 1596 ఆనంద నామ సంవత్సరం జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్ పూర్వం మూడు ఘడియల ముహూర్తాన 1674 జూన్ 6న, చత్రపతి శివాజీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. తద్వారా తొలి స్వరాజ్య సంస్థాపకుడైనాడు. అందుకే జ్యేష్ఠ శుక్ల త్రయోదశిని "హిందూ సామ్రాజ్య దినం"గా జరుపు కుంటారు. నేలకొరిగిన హిందూ ధ్వజాన్ని, మళ్లీ ఉత్తుంగ శిఖరాలలో ఎగురవేసి, మృతప్రాయమై ఉన్న హిందుత్వంలో అమృతాన్ని నింపి, ప్రాణప్రతిష్ట చేసిన మహనీయుడు శివాజీ. అతి సామాన్య బాల్యం, సాహసోపేత యవ్వనం, ప్రదర్శిత ధైర్యం, రాజనీతిజ్ఞత, చతురత, హిందువులలో మేల్కొల్పిన ఆ పూర్ణ దేశభక్తి అజరామరాలు. మహారాష్ట్ర ప్రాంతంలో, యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం, 1307 మార్చి 24 తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనము చేయబడగా, 350 ఏళ్ళ వరకు మరియొక ఒక హిందూ సామ్రాజ్యమే లేకుండెను. ఔరంగాబాద్ సమీపాన వేరూడ్ గ్రామానికి చెందిన మాలోజీ రావు అహ్మద్ నగర్ సుల్తాన్ నిజాం షాహీ కొలువులో ఉద్యోగియై, శక్తియుక్తులతో పూనా జాగీరును సంపాదించాడు. మొగలులతో యుద్ధం చేస్తూ 1605 లో మరణించాడు. అప్పటికి మాలోజి రావుకు 5ఏళ్ల శహాజి, 3 ఏళ్ల అరిఫ్ జీ కుమారులు ఉండిరి. మాలోజీ తమ్ముడగు విటోజీ వద్ద పెరగగా, నాటి నిజాం షాహీ కొలువులోని సర్దార్ లఖుజీ రావు కూతురు జిజియాబాయితో శహాజీ వివాహం జరిగింది. చిన్నతనంలోనే అత్త వారి ఇంటికి వచ్చిన జియాకు దేశ పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగింది. గోవధలు, దేవాలయాలు విగ్రహాల ధ్వంసాలు, ఆస్తుల దోపిడీలు, ఇళ్ల దహనాలు చూశాక ఆమెలో జుగుప్స రేగింది. బాల్యముననే రామాయణ, భారతాది గ్రంథాల పఠనం మూలంగా, విదేశీ పాలన నుండి విముక్తి కలిగి, రామరాజ్య స్థాపన కావాలనే కోరిక ప్రబలమైన నిలిచింది. జిజియాబాయి తండ్రి లఖుజీ రావు కు ముగ్గురు కుమారులు కాగా, వారి పలుకుబడులు నిజాం షాహికి కన్నెర్ర గావించగా, తన రాజధాని యగు దౌలతాబాద్ కు, ఆయన కుమారులను పథకం ప్రకారం పిలిపించి, నలుగురిని 1629 జూలై 25 ఆషాఢ పౌర్ణమి నాడు హత్య గావించాడు. శహాజీ మొగలుల వద్ద పనిచేస్తున్న సమయాన, 1630 ఫిబ్రవరి 19వ తేదీన, "భావి హైందవ సామ్రాజ్య నిర్మాత" అయిన శివాజీ జన్మించాడు. శహాజీ తన జాగీరు పాలనా నిర్వహణకై, పండితుడు, పాలనాదక్షుడు "దాదాజీ కొండదేవ్" అనే బ్రాహ్మణుని నియమించుకోగా, జిజియాబాయి, కుమారునితో సహా ఆయన పర్యవేక్షణలో ఉండిరి. దాదాజీ కొండదేవ్, శివాజీకి వయసుకు తగ్గ విద్యలు, చక్కని శిక్షణనిచ్చి, పదవ ఏట వివాహం కూడా చేశాడు. వివాహానికి రాలేని తండ్రిని కలవడానికి బెంగళూరు వెళ్ళిన శివాజీకి, తండ్రి బీజాపూర్ ను చూపించగా, తురుష్కుల వల్ల ఉజ్వలమైన విజయనగర సామ్రాజ్యం విధ్వంసం, ఫలితంగా కొల్లగొట్ట బడిన ధనముతో వారు ఆనందంతో తులతూగే సంఘటనలు, హృదయంలో ప్రతిష్ఠితాలైనాయి. శివాజీ స్వాతంత్ర్య భావాలను గ్రహించిన శహాజీ, తన కుమారుని పూనాకు పంపుతూ, శాం రావు రాంఘెకర్ అనే అనుభవజ్ఞుని పీష్వా గా నియమించాడు. దేశభక్తి ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీకి, తల్లి శిక్షణ లోనే రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యము నిర్మాణం చేయాలని కోరిక స్థిరపడింది. శివాజీ జాగీరు లో రాంఝూ గ్రామపు పటేలు, ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేల్ ను బంధించ, వధించి, కాళ్లు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడయ్యాడు. కాశ్మీరం నుండి కావేరి వరకు మధ్యనున్న చాందా గోండు వనం వదిలి, మిగిలిన దేశమంతా తురుష్కుల ఆధీనంలో ఉండెను. దేవగిరి, విజయనగరం రాజ్యాలు స్థాపించాక, రెండుసార్లు శహాజీ చేసిన ప్రయత్నాలు విఫలం కాగా, శివాజీ మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం పాటుపడిన దేవాలయం, కొండ గుహ, కీకారణ్యం, ఇసుక తిన్నె లాంటి ప్రదేశాలలో చర్చోప చర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన "కాన" లోయలోని "తోరణ దుర్గాన్ని" జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. అందు లభించిన నిధితో, తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న "మురుంబ దేవ" " అని పేరు పెట్టాడు. తర్వాత "కువారి" కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కు పచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత "కొండనా కోట"ను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. "శివరళ", "సుభాను మంగళి" దుర్గాలను వశపరచు కున్నాడు. ఇంతలో 1648 జూలై 25న శహాజీ, వజీరు ముస్తఫా, బాజీ ఘోర్పడెలు సైన్యంతో శహాజీ బంధించాడు. బీజాపూర్ సుల్తాన్ ను శరణు

*పుణ్యభూమి అయిన భారతావనిలో అనేకానేక దేశ భక్తులు తమ జీవితమే ధర్మంగా, ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యులైనారు. వారిలో నిత్య స్మరణీయుడు శివాజీ. శాలివాహన శకం 1596 ఆనంద నామ సంవత్సరం జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్ పూర్వం మూడు ఘడియల ముహూర్తాన 1674 జూన్ 6న, చత్రపతి శివాజీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. తద్వారా తొలి స్వరాజ్య సంస్థాపకుడైనాడు. అందుకే జ్యేష్ఠ శుక్ల త్రయోదశిని "హిందూ సామ్రాజ్య దినం"గా జరుపు కుంటారు.*

వేయడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే ప్రశ్నలకు తల్లి జిజియాబాయి, తన మాంగల్యం కన్నా దేశభక్తిని ప్రోత్సహించి సమాధానం లభింప జేసింది. పురంధర కోటలో ఉన్న శివాజీ, కొద్ది సైన్యానికి ఫతేఖాను సైన్యానికి భీకర యుద్ధం జరగగా, శివాజీకే విజయం చేకూరి, చివరకు 1648 ఆగస్టు 8న ఫతేఖాను ఓడింపబడ్డాడు. పురంధర దుర్గంలో ఫతేఖాను, బెంగళూరులో ఫరాదఖాన్ ఓటమి పాలు కాగా, బీజాపూర్ లో శహాజీ కూడా 1649 మే 16న జేష్ఠ లేక పౌర్ణమి నాడు బంధ విముక్తుడైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహారాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా, శివాజీ వారిని బంధించి ఉచిత పదవులు కట్టబెట్టి, నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానది సమీప టావలి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేక పోగా, ఆయన భార్య దత్త పుత్రునిగా యశ్వంత రావు కు పదవిని ఇచ్చాడు. ఆయన శివాజీ అధికారానికి ఇష్టపడని కారణాన, 1656 లో యుద్ధంలో ఓడించి స్వరాజ్యంలో కలుపు కున్నాడు. దీనిలో అంతర్భాగంగా కొండ ప్రాంతమైన "రాయగిరి" కోట నే కొన్నాళ్ళకు శివాజీ రాజధానిగా "రాయగడ దుర్గం"గా ఏర్పడింది.

1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్ షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదార్ ఐన, ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న రాజ్యంలో కలుపు కున్నాడు. బీజాపూర్ ప్రాంతంనుండి కోండ్వానా, కొంకణ, దండ రాజపురి, భీమండి, కళ్యాణి, మాహు తదితర కోటలను, పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని చేయించాడు. కటావ్, మయని, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాలిఘడ్,ఎగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కార తలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావ సింహ, జస్వంత్ సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్, సూరత్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ జైత్రయాత్ర ఫలితంగా శాలివాహన శక 1596 ఆనంద నామ సంవత్సర జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్పూర్వ మూడు ఘడియల సుముహూర్తాన 1674 జూన్ 6 న సింహాసనాన్ని అధిష్ఠించాడు. రాజ్యాభిషేక అనంతరం రాజ్యారోహణం జరిగింది. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెండర్ మహారాజుకు ప్రణమిల్లి, 1600 రూపములను కానుకగా సమర్పించాడు. తన రాజ్యానికి అష్ట ప్రధానుల పారశీక నామాలను మార్చి, "సంస్కృత పేర్లు" పెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగం సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశము ను తయారు చేయించాడు. 30 సంవత్సరాలు శివాజీ ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ, హిందువులలో నూతనోత్తేజం నింపి, సార్వభౌమాధికార యుక్త స్వరాజ్యం స్థాపించ బడినది. 50 ఏళ్ల సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా, దేహం పూర్తిగా అలసి పోగా, ఆరోగ్యం క్షీణించి, 1680 ఏప్రిల్ 3న చైత్ర శుక్ల పాడ్యమి నాడు శివాజీ తుది శ్వాస వదిలాడు.



సంగనబట్ల
9440595494



# జాతీయం-అంతర్జాతీయం



## అయోధ్య ఉన్నతాధికారి రాజీనామా..

- విరాళాల కుంభకోణంపై సిట్ ఏర్పాటు
- దానికి చట్టబద్ధత లేదన్న కేజ్రీవాల్



**లక్నో, జూన్ 24,(ఎ.ఎం.ఎస్):** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ విరాళాల అక్రమాలపై అయోధ్యలోని రామ జన్మభూమి పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైన విషయం తెలిసిందే. 8 మందిపై శ్రీ రామ జర్మభూమి ట్రస్టు సభ్యులు కృష్ణ మోహన్ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత(బిఎన్ఎస్) లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా రామ మందిర ట్రస్టులోని ఒక ఉన్నతాధికారి, ఒక ట్రస్టీ నైతిక కారణాలతో రాజీనామా చేశారు. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు చంపత్ రాయ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయనతో పాటు మరో కీలక వ్యక్తి అనిల్ మిశ్రా రాజీనామాలను సమర్పించారని ఒక అధికారి ధృవీకరించారు.

మరోవైపు ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో ఈ వ్యవహారంపై రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నియమించగా..అది కంటి తుడుపు చర్య అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అయోధ్య రామమందిర విరాళాల కుంభకోణంపై విచారణ కోసం సిట్ ఏర్పాటు ఒక కంటితుడుపు చర్య అని, దానికి చట్టబద్ధత లేదని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఈ సిట్ అసలు లక్ష్యం, ఉద్దేశ్యం సత్యాన్ని వెలికితీయడం కంటే ఈ కేసులో చిక్కుకున్న పలుకుబడి ఉన్న వ్యక్తులను రక్షించడమేనని తెలిపారు. అయోధ్యలోని రామమందిరం విరాళాల గల్లంతు కుంభకోణంపై నిష్పక్షపాతంగా నిర్దిష్ట కాలపరిమితిలో విచారణ జరగాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను ఈ నెల 29న ప్రస్తావించాల్సిందిగా సుప్రీం కోర్టు గురువారం సదరు పిటిసనర్‌కు సూచించింది.

జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ ముందు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ దీనిపై అత్యవసర విచారణ జరగాలని పిటిషనర్లు కోరారు.

## వెనిజులాలో పెరిగిన మృతుల సంఖ్య

- ఇప్పటి వరకు 235 మంది దుర్మరణం
- 1500 మందికి పైగా క్షతగాత్రులు



**కారకాస్, జూన్ 26:** వెనిజులాలో గురువారం కొద్ది క్షణాల్లో రెండు భారీ భూకంపాలు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ పెను విధ్వంసంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాది మంది గాయపడ్డారు. లక్షలాది మంది నిరాశ్రయులుగా మిగిలిపోయారు. ఇప్పటి వరకు 235 మంది ప్రాణాలు కోల్పోగా.. 1500 మందికి పైగా గాయపడినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, శిధిలాల కింద ఇంకా పలువురు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. రిక్టర్ స్కేల్‌పై 7.2, 7.5 తీవ్రతతో భూకంపాలు సంభవించడంతో భవనాలు కూలిపోయాయి. దాంతో వెనిజులా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలను కొనసాగిస్తోంది. విపత్తు నేపథ్యంలో అమెరికా, భారత్, ఇరాన్, చైనా, స్పెయిన్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు వెనిజులాకు సాయం చేసేందుకు ముందుకొచ్చాయి.

అమెరికా ప్రభుత్వం 150 మిలియన్ డాలర్ల అత్యవసర సాయాన్ని వెనిజులాకు ప్రకటించింది. దాంతో పాటు రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సహాయక చర్యల కోసం పంపుతున్నట్లు తెలిపింది. అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ అత్యంత వేగంగా, సమర్థంగా వెనిజులాకు సహాయం అందిస్తామని చెప్పారు. వెనిజులా భూకంపంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మోదీ.. అన్ని విధాలా సాయం అందించడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. "వెనిజులాలో జరిగిన విధ్వంసకర భూకంపాలతో తీవ్రంగా దిగ్భ్రాంతి చెందాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం. అవసరమైన అన్ని విధాలా సాయం అందించడానికి భారత్ సిద్ధంగా ఉంది" అంటూ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ వెనిజులాకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. చైనా కూడా వెనిజులా అవసరాలకు అనుగుణంగా సహాయం అందిస్తామని ప్రకటించింది. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్ సానుభూతి ప్రకటించి సహాయం చేస్తామని తెలిపారు. ఈ భూకంపంలో వెనిజులా రాజధాని కారాకాస్ విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతింది. దాంతో విదేశాల నుంచి సహాయక బృందాలు రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. కాలం గడుస్తుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలాలు పూర్తిగా తొలగించిన తర్వాత మృతుల సంఖ్యపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



### పాస్‌పోర్టు ఫీజుల ధరలు
## భారీగా పెంపు

- జులై ఒకటి నుంచి అమల్లోకి
- అధికారిక నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ, జూన్ 24,(ఎ.ఎం.ఎస్):** సందు దొరికితే చాలు జనంపై భారాలు మోపటానికి మోడీ సర్కార్ సిద్ధమైపోతుంది. దీనికి తాజా ఉదాహరణే పాస్‌పోర్టు ఫీజుల ధర పెంపే. జులై 1 నుంచి సవరించిన ధరలు అమల్లోకి రానున్నాయి. పాస్‌పోర్ట్‌లను పౌరసత్వానికి రుజువుగా పరిగణించాలా వద్దా అనే విషయంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో ఈ మార్పు వచ్చింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాస్‌పోర్ట్ (సవరణ) నిబంధనలు, 2026ను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, 2026 జులై 1 నుంచి కొత్త పాస్‌పోర్ట్ ఫీజులు వర్తిస్తాయి. ఈ మార్పుతో, పాస్‌పోర్ట్ పొందడానికి ఇప్పుడు 2,000 రూపాయల వరకు ఖర్చు కావచ్చు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కొత్త విధానం అమలులోకి వచ్చిన తర్వాత, కొత్త పాస్‌పోర్ట్ పొందడానికి, పాస్‌పోర్ట్‌ను పునరుద్ధరించుకోవడానికి, ఇతర సంబంధిత సేవలకు సవరించిన ఫీజులు వర్తిస్తాయి. దీంతో, 1980 పాస్‌పోర్ట్ నిబంధనలలోని పాత ఫీజుల జాబితా (షెడ్యూల్ IV) స్థానంలో కొత్త ఫీజుల జాబితా అమలులోకి వస్తుంది.

కాగా దేశంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించటంలేదు. ఎలాగోలా కష్టపడి విదేశాలకు వెళ్లాలంటే పాస్ పోర్టు తప్పనిసరి. ఇప్పటి వరకూ నిత్యావసరాలు, చమురు ధరలను పెంచుకుంటూ పోతున్న మోడీ ప్రభుత్వానికి అమాంతంగా పాస్ పోర్టు పెంచేద్దామనే ఆలోచన వచ్చింది. పాస్ పోర్టు ఫీజు పెంపుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

## అలా చేస్తే రిజర్వేషన్లు వర్తించవు..

- బీసీఎం కోటాపై తమిళనాడు కోర్టు తీర్పు
- డీఎంకే తెచ్చిన జీవో చట్టబద్ధం కాదని వ్యాఖ్య



తమిళనాడు రాష్ట్రంలో ఇస్లాం మతంలోకి మారినా కూడా బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం (బీసీఎం) కోటా కింద రిజర్వేషన్ పొందేలా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. న్యాయమూర్తులు జీఆర్ స్వామినాథన్, పీబీ బాలాజీతో కూడిన ధర్మాసనం తమిళనాడు తీసుకొచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమంటూ ఈ తీర్పు వెల్లడించింది. 2024 మార్చి 9న అప్పటి డీఎంకే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం బీసీ, ఎంబీసీ, డీఎన్‌సీ, ఎస్సీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఇస్లాంలోకి మారితే వారిని బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం (బీసీఎం) కేటగిరిలో పరిగణించి రిజర్వేషన్ అందిస్తామని పేర్కొంది. అదేవిధంగా వారిని తమిళనాడులో గుర్తింపు పొందిన ఏడు బీసీఎం ముస్లిం వర్గాల్లో ఒకటిగా కమ్యూనిటీ సర్టిఫికెట్ జారీ చేయాలని కూడా అధికారులను ఆదేశించింది.

డీఎంకే తీసుకొచ్చిన ఉత్తర్వులు చట్టబద్ధం కాదంటూ హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. ఇస్లాంలోకి మారిన వ్యక్తి కేవలం ముస్లిం మాత్రమే. అతను బ్యాక్‌వర్డ్ క్లాస్ ముస్లిం (బీసీఎం) హోదా కోరలేడు అంటూ కోర్టు స్పష్టం చేసింది. "హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన వ్యక్తి ముస్లింగా మారతాడు. కానీ అతను లబ్బాయి, రావుతర్, మరక్కయర్ లేదా ఇతర ప్రత్యేక ముస్లిం వర్గాలకు చెందినవాడిగా మారడు. ఆ వర్గాలు పుట్టక ఆధారంగా నిర్ణయించినవి. మత మార్పిడితో వాటిలో సభ్యత్వం పొందలేడు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. తమిళనాడులో ప్రస్తుతం బీసీఎం కేటగిరిలో గుర్తింపు పొందిన ఏడు ముస్లిం వర్గాలు వివరాలు ఇవే.. అన్సార్, డెక్కాని ముస్లింలు, దూదేకుల, లబ్బాయి, మాపిళ్ల, షేక్, సయ్యద్ ఈ వర్గాలు బీసీఎం కేటగిరిలో ఉన్నాయి.

2015లో హబంలో జన్మించిన ఓ వ్యక్తి సమీర్ అహ్మద్‌గా పేరు మార్చుకుని ఇస్లాంలోకి చేరాడు. ఆ తర్వాత తనకు ముస్లిం లబ్బాయి కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా.. 2022లో తహసీల్దార్ ఆ దరఖాస్తును తిరస్కరించారు. ఆ తర్వాత హైకోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యంగ విరుద్ధమని ప్రకటిస్తూ.. సమీర్ అహ్మద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది.



## అతిథికి మర్యాదనివ్వని పాక్ ప్రధాని

- ఇరాన్ అధ్యక్షుడిని ఎండలో నడిపించిన వైనం సర్వత్రా విమర్శలు

**ఇస్లామాబాద్, జూన్ 26:** మనం ఎలా ఉన్నా మన ఇంటికి వచ్చిన అతిథి మాత్రం గొప్పగా చూసుకుంటాం. అలాంటిది ఓ దేశ అధ్యక్షుడు వస్తే ఎలా చూసుకోవాలి. కానీ, పాకిస్థాన్ ప్రధాని చేసిన పనికి నెటిజన్లు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. అతిథిగా వచ్చిన వ్యక్తిని ఎండలో నడింపించి, నువ్వు గొడుగు కిందకు వెళ్తావా అంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజ్కిస్థాన్ పాకిస్థాన్ పర్యటనలో ఉన్నారు. ఇస్లామాబాద్‌లోని ఎయిర్ బేస్‌లో ఇరాన్ అధ్యక్షుడికి స్వాగతం పలికే సమయంలో.. పాక్ ప్రధాని తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గొడుగు కింద నడుస్తుండగా, ఇరాన్ అధ్యక్షుడు మాత్రం ఎండలోనే నడుచుకుంటూ వెళ్తున్నట్లు కనిపించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

వీడియోలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గొడుగు కింద నడుస్తుండగా.. మసూద్ పెజిష్కియన్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ మాత్రం ఎండలోనే నడుస్తున్నట్లు వీడియోలో కనిపించింది. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ గొడుగు కిందకు వచ్చే ప్రయత్నం చేసినా ప్రధాని షెహబాజ్ షరీఫ్ కొద్దిగా పక్కకు జరిగిన దృశ్యాలు కూడా వీడియోలో కనిపించాయి.

## ఫసిపిక్‌లో చైనా నౌకల మ్యాపింగ్

- ఉనికి కోసమే అంటున్న అమెరికా
- చట్టపరమేనని స్పష్టం చేసిన చైనా

**బీజింగ్, జూన్ 26:** చైనా నౌకలు ఇటీవలి కాలంలో తమ ప్రధాన భూభాగానికి చాలా దూరంగా శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాయి. అత్యంత సున్నితమైన సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేశాయి. చైనా సముద్ర తీరానికి ఐదు వందల మైళ్లకు పైగా దూరంలో ఉన్న, అత్యంత వివాదాస్పదమైన మడుగులో పరిశోధనలు చేపట్టాయి. పశ్చిమ పసిఫిక్‌లో కీలక నియంత్రణ రేఖగా భావించే ద్వీపాల సమూహానికి ఆవల తమ ఉనికిని విస్తరించుకోవడానికి చైనా, అమెరికాలు చేస్తున్న ప్రయత్నాలలో బీజింగ్ చర్యలు భాగమేనని విశ్లేషకులు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చైనాలో పర్యటించిన తర్వాత ఈ సముద్ర విన్యాసాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో చైనా సంస్థకు చెందిన మూడు నౌకలు తైవాన్‌కు తూర్పున ఉన్న జలాలలో మ్యాపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాయి. ఇందుకోసం ఫిలిప్పీన్స్, తైవాన్ మధ్య ఉన్న బాషి చానల్ మీదుగా ప్రయాణించాయి. దక్షిణ జపాన్ నుంచి తైవాన్‌ఫిలిప్పీన్ మీదుగా, బోర్నియో నుంచి సింగపూర్ వరకూ దక్షిణ చైనా సముద్రపు అంచుల వెంబడి విస్తరించిన మొదటి ద్వీప శ్రేణికి తూర్పున తొలిసారిగా ఈ నౌకలు కనిపించాయి. మొదటి ద్వీప శ్రేణికి ఆవల ఉన్న ప్రాంతం తమ అధికార పరిధిలోనిదేనని చైనా చెబుతోంది. పసిఫిక్‌లో నౌకల కదలికలను 'చట్టపరమైన ప్రాముఖ్యతరాజకీయ సంకేతాలు ఉన్న సార్వభౌమత్వ ప్రకటన'గా చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాబ్లాయిడ్ పత్రిక గ్లోబల్ టైమ్స్ అభివర్ణించింది. తైవాన్‌కు తూర్పున ఉన్న సముద్ర గర్భాన్ని తమ నౌకలు మొదటిసారిగా మ్యాపింగ్ చేశాయని చైనా తెలిపింది. 'తైవాన్ ద్వీపానికి తూర్పున ఉన్న జలాలు మా తీర ప్రాంతానికి చెందినవే. అక్కడ మా ఉనికి ఉంది.

అధికార పరిధి ఉంది. ఆ ప్రాంతంలో మేమే పాలన చేస్తాం' అని చెప్పింది.



## నీట్ రీ ఎగ్జామ్ కీ విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 24,(ఎ.ఎం.ఎస్):** నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ గత ఆదివారం, జూన్ 21న జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీ గురువారం విడుదలైంది. ఈ విషయాన్ని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీయే (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ప్రకటించింది. పరీక్ష రాసిన అభ్యర్థులు ఆన్సర్ కీని సంస్థ అధికారిక వెబ్‌సైట్ neet.nta.nic.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అంతేకాదు.. ఈ కీ పేపర్‌పై అభ్యంతరాలుంటే తెలిపేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు





తమ అప్లికేషన్ నెంబర్, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి. ఈ నెల 28, రాత్రి 11.50 నిమిషాల వరకు ఈ ఆన్సర్ కీపై అభ్యంతరాలుంటే తెలపవచ్చు.

## గల్ఫ్ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నాం..

- అమెరికా విదేశాంగ మంత్రి రుబియో హామీ
- ఒప్పందం ఇరాన్‌కు అనుకూలంగా ఉండబోదని వెల్లడి

**బహ్రెయిన్, జూన్ 26 :** మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు కుదుర్చుకునే ఏ ఒప్పందం అయినా గల్ఫ్ దేశాల భద్రతా ప్రయోజనాలను కాపాడుతుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. బహ్రెయిన్ లో ఆయన గురువారం గల్ఫ్ అరబ్ విదేశాంగ మంత్రులు, అధికారులతో సమావేశమైన సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాల శత్రువు అయిన ఇరాన్‌తో శాంతిని నెలకొల్పుకోవాలని అమెరికా భావిస్తోందని, అయితే అది తమ గల్ఫ్ భాగస్వాముల భద్రతకు, సౌభాగ్యానికి ఎలాంటి ప్రమాదం కలిగించబోదని తెలిపారు.

అంతకుముందు ఆయన యుఏఈ, కువైట్‌లలో కూడా పర్యటించారు. ప్రతిపాదిత ఒప్పందం పూర్తిగా ఇరాన్‌కు అనుకూలమైనదిగా ఉండబోదని రుబియో చెప్పారు. 'మిత్రదేశాల భద్రతకు విఘాతం కలిగించే పనులేవీ చేయం' అని అన్నారు. హార్ముజ్‌లో రుసుములు, ఫీజులు వసూలు చేయడాన్ని గల్ఫ్ దేశాలు వ్యతిరేకిస్తున్నాయని రుబియో తెలిపారు.



చర్చల సందర్భంగా గల్ఫ్ నేతలు తీవ్రమైన ఆందోళనలు వ్యక్తం చేశారని, హార్ముజ్‌లో రుసుములుఫీజుల వసూలుకు మద్దతు ఇవ్వబోమని తెలిపారని చెప్పారు. గల్ఫ్ నేతలతో చాలా మంచి సమావేశాలు జరిగాయని అన్నారు. కాగా గల్ఫ్ నేతలతో జరిపిన సమావేశాలలో ఇరాన్ పునర్నిర్మాణ నిధి ప్రస్తావన రాలేదని రుబియో రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు.

## మేం చెప్పిన మార్గం నుంచే వెళ్లాలి..

- వాణిజ్య నౌకలకు ఐఆర్‌జీసీ హెచ్చరిక
- లేదంటే చర్యలు తప్పవు

**టెహ్రాన్, జూన్ 26:** హార్ముజ్ జలసంధిలో అనుమతించిన మార్గాలలోనే ప్రయాణించాలని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కు చెందిన నౌకాదళం వాణిజ్య నౌకలకు సూచించింది. ఇరాన్ నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే దారిలో ప్రయాణిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. 'కొన్ని సంస్థలు ముందస్తు నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఇరాన్‌తో సమన్వయం చేసుకోకుండా హార్ముజ్‌లో వాణిజ్య నౌకల ప్రయాణానికి కొత్త రవాణా మార్గాన్ని ప్రకటించాయి. ఈ ప్రతిపాదిత మార్గం ఆమోదయోగ్యమైనది కాదు. అది తీవ్రమైన భద్రతా ప్రమాదాలకు కారణమవుతుంది' అని తెలిపింది. ఇరాన్ అనుమతించిన మార్గాల మీదుగానే హార్ముజ్‌లో ప్రయాణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఆ మార్గాల వెలుపల ప్రయాణించే నౌకలను నిషేధిస్తామని, వాటిని అత్యంత ప్రమాదకరమైనవిగా చూస్తామని చెప్పింది. నిర్దేశించిన కారిడార్ల వెలుపల ప్రయాణించవద్దని అన్ని నౌకలకు సలహా ఇచ్చింది.

హార్ముజ్‌లో ప్రయాణించే నౌకలు విధిగా ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరపాలని ఐఆర్‌జీసీ నేవీ తెలిపింది. హార్ముజ్‌ను దాటాలంటే ఛానల్ 16 ద్వారా తమతో సమన్వయం చేసుకోవాల్సిందేనని తేల్చి చెప్పింది. దీనిని ఉల్లంఘించే నౌకలన్నింటి పైన చర్యలు తప్పవని హెచ్చరించింది. హార్ముజ్‌పై నియంత్రణ విషయంలో ఒమన్ బుధవారం చేసిన ప్రకటనపై ఐఆర్‌జీసీ ఈ మేరకు ఘాటుగా స్పందించింది. అంతర్జాతీయ సముద్రయాన సంస్థతో సమన్వయం ద్వారా హార్ముజ్‌లో నౌకా రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేశామని ఒమన్ ఆ ప్రకటనలో తెలిపింది. ఎలాంటి రవాణా రుసుములు లేకుండా వాణిజ్య నౌకలు స్వేచ్ఛగా హార్ముజ్‌లో ప్రయాణించడం కోసం దీనిని ఏర్పాటు చేశామని వివరించింది.

## ఆపరేషన్ సిందూర్.. అమర జవాన్లు వీరే

- వెల్లడించిన కేంద్రం
- వారిలో ఐదుగురు ఆర్మీ.. మరొకరు వైమానిక దళానికి చెందిన వారు

**న్యూఢిల్లీ, జూన్ 24,(ఎ.ఎం.ఎస్):** గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కొంత మంది జవాన్లు వీరమరణం పొందారు. తొలిసారిగా ఆ అమర జవాన్ల వివరాలను కేంద్రం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అమరులైన జవాన్ల పేర్లను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. వీరిలో ఐదుగురు ఇండియన్ ఆర్మీకి చెందినవారు కాగా.. ఒకరు వైమానిక దళానికి చెందిన అగ్నివీర్ ఉన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఉన్న వార్ మెమోరియల్ వద్ద ప్రత్యేక శిలాఫలకంపై వీరి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు. అమరులైన జవాన్లలో 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్, జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజ్మెంట్ 4వ బెటాలియన్‌కు చెందిన రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్, 5 ఫీల్డ్ రెజిమెంట్ లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, 237 ఫీల్డ్ వర్క్‌షాపు హవల్దార్ సునీల్ కుమార్ సింగ్, ఎయిర్‌ఫోర్స్ 39వ వింగ్ సార్జెంట్ సురేంద్ర కుమార్, 851 లైట్ రెజ్మెంట్ అగ్నివీర్ మురళీ నాయక్ ఉన్నారు. వీరిలో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం మూడో అత్యున్నత




సైనిక పురస్కారం 'వీర చక్ర'తోనూ, సార్జెంట్ సురేంద్ర కుమార్‌ను 'వాయు మెడల్'తో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. అగ్నివీర్ మురళీ నాయక్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కల్లితండాకు చెందినవారు. 2022లో అగ్నివీర్‌గా ఎంపికైన మురళీ నాయక్ ముందు పంజాబ్, అసోంలో విధులు నిర్వర్తించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా 2025 మే 7వ తేదీ అర్ధరాత్రి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని జైషే మహమ్మద్, లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాయిద్దీన్ ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. దీంతో ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు మే 10 కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టాయి. ఇక, అమరవీరులకు అంకితం చేసిన జాతీయ యుద్ధ స్మారకం 16 వృత్తాకార గ్రానైట్ గోడలతో ఉంటుంది. స్వాతంత్ర్యం తర్వాత దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రతి సైనికుడి పేరు, హోదా, యూనిట్ ఈ గోడలపై చెక్కబడి ఉంటాయి. ఆపరేషన్ సింధూర్‌కు చెందిన ఈ ఆరుగురు వీరులు కూడా ఈ స్మారక చిహ్నంలో శాశ్వతంగా ఉండనున్నాయి.

## పీఎన్‌బీ మేనేజర్ అరెస్టు..

- లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై జైలుకు

**లక్నో, జూన్ 26:** ఉత్తరప్రదేశ్ ఆగ్రాలోని భద్రౌలి శాఖకు చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్‌ను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులు అరెస్టు చేశారు. సోలార్ ప్యానెల్ రుణ దరఖాస్తులను పరిశీలించి ఆమోదించేందుకు, ఒక్కో దరఖాస్తుకు రూ. 7,000 చొప్పున




బ్యాంక్ మేనేజర్ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 52,000 లంచం తీసుకునేందుకు అంగీకరించినట్లు కూడా తెలిసింది. ముందుగా ఫిర్యాదుదారు నుండి రూ. 30,000 లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు వల పన్ని ఆ మేనేజర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని గురువారం అరెస్టు చేశారు. జూన్ 25న అరెస్టు అయిన నిందితుడిని జూన్ 26న ఘజియాబాద్‌లోని సంబంధిత కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసుపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గోదావరిని ఎడారిగా మార్చిన పాపం ప్రభుత్వానిదే: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూసి గోదావరిలో నీటిని నిల్వ చేయాలి**

**రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి**



**మంథని, జూన్ 26(వుదయం ప్రతినిధి)**

కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను వెంటనే మూసివేసి గోదావరిలో నీటిని నిల్వ చేయాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంథని సమీపంలోని గోదావరి తీరాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదావరిని ఎడారిని తలపించే పరిస్థితికి తీసుకువచ్చిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుదేనని ఆరోపించారు. వాతావరణ శాఖ ముందుగానే ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశముందని హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.జూలై నెల ప్రారంభం కానున్నా గోదావరిలో నీటి నిల్వలు లేక నది ఎడారిని తలపించే పరిస్థితి ఏర్పడిందని, ప్రజలు గంగా స్నానం చేయడానికి కూడా ఇసుకలో చెలిమెలు తవ్వుకోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తే లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, కానీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతుల అవసరాల కంటే ఇసుక తవ్వకాలపైనే ప్రభుత్వం ఎక్కువ దృష్టి సారిస్తోందని విమర్శించారు.సన్న రకాల వరికి బోనస్‌ను కేవలం ఏడు రకాలకే పరిమితం చేయడం వల్ల రైతులు నష్టపోతారని, నీటి కొరత కారణంగా ఈసారి వరి సాగు తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య కూడా మరింత తీవ్రమయ్యే అవకాశముందని పేర్కొన్నారు.అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను వెంటనే మూసివేసి, అవసరమైన చోట సిల్ట్ తొలగించి గోదావరిలో నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వంతక్షణమే స్పందించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను విస్మరించి ప్రభుత్వం వ్యవహరిస్తే ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పుట్ట మధూకర్ కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, తగరం శంకర్‌లాల్, కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, కనవేన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మిట్ట సత్యనారాయణ, ఆకుల రాజబాబు, పుప్పాల తిరుపతి, అరెపల్లి కుమార్,జంజర్ల శేఖర్, పోలు కనకయ్య, పుట్ట రామయ్య, వేముల లచ్చన్న, ఉడుత లింగయ్య, ఇర్ఫాన్, జలీల్, యాకూబ్, జావిద్, ధర్మేందర్, సమ్మయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న సంగారెడ్డి జాయింట్ కలెక్టర్ మాధురి



**మల్యాల మండలం జూన్ 26 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంను సంగారెడ్డి జాయింట్ కలెక్టర్ మాధురి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సంగారెడ్డి జాయింట్ కలెక్టర్ మాధురి శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఆపరేటర్లను యథావిధిగా కొనసాగించాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం**

**ఆందోళనలో 632 మంది ఉద్యోగులు**



**ధర్మపురి,జూన్ 26 (వుదయం ప్రతినిధి):**

రెవెన్యూ శాఖలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న 632 మంది టైపిస్టు లు,కంప్యూటర్ ఆపరేటర్లను ఎలాంటి నిబంధనలు విధించకుం డా యథావిధిగా విధుల్లో కొనసా గించాలని తెలంగాణ ఐటీ,సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు.శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.తమను విధుల్లోంచి తొలగించేలా ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మెమోపై ఆపరేటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా నమ్ముకున్న ఉద్యోగాలను ఒక్కసారిగా ఊడబీకితే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని మంత్రి వద్ద ఆవేదన వెళ్లగక్కారు.తక్షణమే ఆ వివాదాస్పద మెమోను రద్దు చేసి, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,అలాగే రెవెన్యూ శాఖ మంత్రి తో ప్రత్యేకంగా మాట్లాడి, టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్ల సేవల ను యథావిధిగా వినియోగించుకు నేలా చొరవ చూపాలని వారు మంత్రి అడ్లూరిని వేడుకున్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో స్టేట్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎం.భూమేష్,జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్య దర్శులు దేవాల గోపి, రాపర్తి రాజేందర్, నరేష్, మహేందర్, అర్జున్, వినోద్,సల్మాన్,రాజేందర్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జూన్-26 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహిస్తున్నట్లు, ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్‌లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలని, ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమశాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని, అధికారులు తమ బాధ్యతను సక్ర మంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



**కామారెడ్డి, జూన్ 26 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శుక్రవారం జుమ్మా నమాజ్ అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకోవాలంటే ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, ఓటరు జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకోవడం లేదా ధృవీకరించుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు.ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కుఅని అన్నారు. తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ వెంటనే పరిశీలించాలని, ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దించుకోవాలని, కొత్తగా అర్హత పొందిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.అవసరమైన పత్రాలను సమర్పించి నమోదు, సవరణ, ధృవీకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడం రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, కార్యకర్తలందరి బాధ్యత అని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులు, కాలనీల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, ఒక్క అర్హ ఓటరు కూడా నమోదు కాకుండామిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలి. ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి అని మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ..లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలి**

**అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది**

**భారీ అవగాహన ర్యాలీ.. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ**




**రాజన్న సిరిసిల్ల, జూన్ 26 (వుదయం ప్రతినిధి):**

రాష్ట్రంలో డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్ లక్ష్యాల సాధనపై దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్య హాజరయ్యారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద జెండా ఊపి భారీ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మనాయక కళ్యాణ మండపం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా విద్యార్థులు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయడంతో పాటు "సే నో టు డ్రగ్స్.. సే యెస్ టు లైఫ్", "పిల్లల భద్రత డ్రగ్స్‌కు అడ్డుకట్ట" వంటి నినాదాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అతిథులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బాటను వీడి.. మైదానం బాట పట్టాలి అనే ముఖ్యమంత్రి పిలుపును ఆచరణలో పెట్టాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లోనూ రాణించేలా ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి యువకుడు ఏదో ఒక సృజనాత్మక అభిరుచిని అలవర్చుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమకు నచ్చిన రంగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం అందుబాటులో ఉందని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద సమాచారం ఉంటే ఈగల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908, కంట్రోల్ రూమ్ 8712671111, 112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీధర్‌బాబు, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అపోహలు వద్దు.. బోగస్ ఓట్ల తొలగింపే లక్ష్యం: ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ (ఉదయం ప్రతినిధి):**

సమగ్ర ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, అర్హులైన ప్రతి ఓటరికి హక్కు కల్పించడంతో పాటు బోగస్ ఓట్లను తొలగించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తన ఓటరు వివరాలను బీఎల్ఓకు అందజేసి, అవసరమైన దరఖాస్తు ఫారాలను స్వయంగా నింపి ఎమ్మెల్యే సమర్పించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రత్యేక పరిశీలన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఇంటి సర్వే కోసం బీఎల్ఓలు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫోటోను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకుడు మనోజ్ పవార్, బీఎల్ఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

## మిలిటెంట్ రాజకీయాలు మానుకో బాల్క సుమన్..

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్..**



**మంచిర్యాల/రామకృష్ణాపూర్/ జూన్ 26(వుదయం ప్రతినిధి)**

26 రోజుల క్రితం బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు అరెస్ట్ కావడం జరిగిందని డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి అన్నారు. గురువారం విడుదలైన అనంతరం సైతం బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ...గతంలో మీరు ఈ ప్రాంతంలో పరిపాలించిన సమయంలో ఈ ప్రాంతపు సొమ్మును కాజేసిన మీరు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు అని అన్నారు.కేసీఆర్ కుటుంబం సింగరేణి సొమ్మును, గోదావరి ఇసుకను దోచుకుపోయారు. టిబిజికేస్ నాయకులు సింగరేణి సంస్థ ను దోచుకున్నారని ఎద్దేవా చేశారు. వివేక్ వెంకటస్వామి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక అభాండాలు వేస్తున్నారు అని అన్నారు. చెన్నూరు నియోజక వర్గంలో సుమన్ కు రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని స్పష్టం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ... గురువారం చంచల్ గూడ జైలు నుండి బయటకు వచ్చిన బాల్క సుమన్ మళ్ళీ వివాదాస్పద వ్యాక్యాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను రెచ్చగొడుతూ, కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యే లు రాజీనామా చేయాలని బాల్క సుమన్ అంటున్నారని , ఎందుకు రాజీనామా చేయాలో సుమన్ చెప్పాలని డిమాండ్ చేశారు. బారాస పార్టీ ఓడినా సరే మీకు ఇంకా సిగ్గు రాలేదా అని ప్రశ్నించారు. గతంలో మీరు సింగరేణి లో కొత్త బావులు, క్వార్టర్స్ తెస్తామని చెప్పిన మీరు మాట తప్పారని ఎద్దేవా చేశారు. ఓపెన్ కాస్ట్ లు రాకూడదని చెప్పిన మీరు ఓపెన్ కాస్ట్ లు ఏర్పాటు చేసిందే మీరు అని స్పష్టం చేశారు. సింగరేణి నీ బొందల గడ్డగా మార్చింది బిఆర్ఎస్ పార్టీనే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని బాల్క సుమన్ గ్రహించి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మిలిటెంట్ రాజకీయాలు మానుకో సుమన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భీమ మల్లేష్,నాయకులు బత్తుల శ్రీనివాస్, మేకల సురేందర్, మెట్ట సుధాకర్, గోపు రాజం, సత్యనారాయణ, ప్రకాష్, కొక్కుల సతీష్, ప్రేమ సాగర్, మహిళా నాయకురాళ్ళు పుష్ప ,నాయకులు పాల్గొన్నారు.

## మానవతా విలువలకు ప్రతీక మొహర్రం



**నిజాంసాగర్ జూన్ 26 (వుదయం ప్రతినిధి) :**

మానవతా విలువలకు ప్రతీక అయిన మొహర్రం పండుగను శుక్రవారం కుల మతాలకతీతంగా ముస్లింలు, హిందువులు కలిపి మొహరం పండుగను కన్నుల పండుగగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిజాంసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పీర్ల మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులు పీర్లకు చాదర్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం సందర్భంగా ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే ఈ పర్వదినాన్ని ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.వేడుకల్లో ముస్లిం సోదరులతో పాటు హిందూ మతస్థులు, ఇతర మతాల ప్రజలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. పీర్ల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలు నిర్వహించారు.మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరిగేలా స్థానిక ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వేడుకలు ప్రశాంత వాతావరణంలో వైభవంగా నిర్వహించుకున్నారు.

## త్యాగానికి మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ

**మసీదులో మొక్కులు చెల్లించిన భక్తులు**



**ధర్మపురి జులై 29, (వుదయం ప్రతినిధి):**

త్యాగానికి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగమొహర్రం.మొహర్రం వేడుకలు అన్ని మతాలకు అతీతంగా చిన్న పెద్ద తేడా లేకుండా ధర్మపురి పట్టణం లోని అషర్ (మసీదు)లో భక్తి శ్రద్దలతో గత పది రోజుల నుండి వేడుకలు సాగగా చివరి రోజు శుక్ర వారం స్థానిక నంది చౌరస్తా వద్ద మసీదులో మత పెద్దల ఆధ్వర్యంలో పీరీలు నిప్పుల గుండం పై నడవగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. అనంతరం పీరీలు,నాల్ సాబ్ లు ప్రధాన విధుల్లో తిరుగగా భక్తులు కుడుక పేర్లు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.పట్టణంలోని సారగ మ్మ వాడ,తెనుగువాడ మసీదుల లో కూడా మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఆయూర్ ఖానాల ముజాఫర్ లు,ఎస్ కె సంయుద్దీన్, ఎస్ కె కాశీమ్,ఎండి అఫీస్, ఎండి ఆదిల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.పెద్ద పులి వేషధారణలతో దూల ఆడుతూ భక్తిని చాటారు. ఈ సందర్భంగా అన్ని పార్టీల నాయ కులు, ప్రజా ప్రతినిధులు, అధికా రులు, గ్రామ ప్రజలు మొహర్రం వేడుకలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పీర్లు, నాల్ సాబ్ లు పురవీధుల్లో ఊరేగింపుతో వెళ్లి గోదావరిలో నిమర్జన చేశారు. ఈ కార్యక్ర మంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాం నరసింహా రెడ్డి పర్యవేక్షణలో ఎస్సె మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం -జిల్లా కలెక్టర్



**మంచిర్యాల/జూన్ 26(వుదయం ప్రతినిధి)**

మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, గుడిపేట 13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని, అందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని, ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్ఏలదే కీలక బాధ్యత

**ప్రతి అర్హుడి ఓటు నమోదు చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ జూన్ 26 {వుదయం ప్రతినిధి} :**

ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో బూత్లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణం, రూరల్ మండల పరిధిలోని బీఎల్ఏలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి అర్హుడైన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు చట్టబద్ధంగా జరిగేలా బీఎల్ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన పత్రాలు సేకరించి దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేయించాలని తెలిపారు. ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు సామాజిక బాధ్యతగా గ్రామాల్లో ఓటరు జాబితాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం పరిశీలన జాబితాలో ఉన్న ఓటర్లకు సమాచారం అందించి, పేరు లేకపోయిన వారు సంబంధిత ఫారాలు నింపి అధికారులకు సమర్పించేలా బీఎల్ఏలు మార్గనిర్దేశం చేయాలని పేర్కొన్నారు.అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలివేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తూము మధు, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు వివిధ రూరల్ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గద్వాలలో గండం

## పారిశుద్ధ్యం 'గాలికి'.. యంత్రాంగం 'నిద్రకు'!

- ముంచుకొస్తున్న డెంగ్యూ, మలేరియా ముప్పు.. పాలకుల్లో చలనం ఏది?
- మురుగుకూపాలుగా గ్రామాలు.. దోమల సామ్రాజ్యాలు.. ప్రజారోగ్యం విలవిల!

(గద్వాల జూన్ 26 (వుదయం బ్యూరో)

వర్షం వస్తే చాలు.. జిల్లా ప్రజల గుండెల్లో వణుకు మొదలవుతోంది. ప్రకృతి ఇచ్చిన పచ్చదనం కంటే, పాలకుల నిర్లక్ష్యం తెస్తున్న రోగాల భయమే పట్టిపీడిస్తోంది. వానాకాలం ముంగిట్లోకి వచ్చేసినా, అధికార యంత్రాంగం మాత్రం 'కుంభకర్ణ' నిద్ర వీడటం లేదు. ప్రతి ఏటా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ మహమ్మారులు పంజా విసురుతున్నా.. ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు 'నత్తనడక'ను కూడా మించిపోయారు. కాగితాల్లో కదులుతున్న ఫైళ్లు.. క్షేత్రస్థాయిలో మురుగు కోరల్లో చిక్కుకున్న ప్రజల ప్రాణాలు.. ఇదీ నేడు జోగులాంబ గద్వాల జిల్లాలో కనిపిస్తున్న దారుణమైన వాస్తవం!



**డ్రైనేజీల్లో పూడికలు సున్నా.. దోమలకు 'రాజమార్గం'!**

జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. గ్రామాలు, మున్సిపల్ కాలనీల తేడా లేకుండా ఎక్కడ చూసినా నిండిపోయిన మురుగు కాల్వలు, రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగునీరు దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోయి, దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇవే దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి, అంటువ్యాధుల వ్యాప్తికి అడ్డాలుగా మారుతున్నాయి. వర్షాలు ముదరకముందే ఈ మురుగుకూపాలను శుభ్రం చేయకపోతే, జిల్లాలో వైద్య ఎమర్జెన్సీ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.రోగం వచ్చాక 'నాటకాలు' వద్దు.. ముందే మేల్కొనండి! వ్యాధులు విజృంభించాక హడావుడిగా మెడికల్ క్యాంపులు పెట్టి ఫొటోలకు ఫోజులివ్వడం కాదు.. 'ముందు జాగ్రత్తే ముఖ్యం' అన్న స్పృహ అధికారులకు కరువైంది. యుద్ధప్రాతిపదికన క్లీనింగ్: వెంటనే డ్రైనేజీల పూడికతీత పనులు చేపట్టి, నీరు నిల్వ ఉండకుండా చూడాలి. నిరంతర ఫాగింగ్: మొక్కుబడి స్ప్రేయింగ్‌లు పక్కనబెట్టి.. లార్వా నివారణకు ప్రతి వీధిలో ఫాగింగ్, యాంటీ లార్వా రసాయనాలు చల్లాలి. తాగునీటి రక్షణ: మంచినీటి ట్యాంకులు, బావులలో బ్లీచింగ్, క్లోరినేషన్ ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించి, కలుషిత నీటి ముప్పును అరికట్టాలి. ప్రభుత్వ ఆసుపత్రులు.. 'రోగుల' శరణాలయాలు కావాలి! పేదవాడికి దిక్కైన ప్రభుత్వ వైద్యశాలలను యుద్ధ ప్రాతిపదికన సన్నద్ధం చేయాలి. ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, వైద్య పరికరాలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను భారీగా నిల్వ ఉంచాలి. సిబ్బంది కొరత: ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయకుండా ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉంటూ 24 గంటలు సేవలు అందించేలా నిఘా పెట్టాలి. శాఖల మధ్య 'సమన్వయం' సున్నా.. బలి కావాలోయ్ జనం? కేవలం వైద్యశాఖ ఒక్కటే పోరాడితే సరిపోదు. పంచాయతీ, మున్సిపల్, విద్యా, సంక్షేమ శాఖలు ఉమ్మడి సమరానికి సిద్ధం కావాలి. అత్యవసర కార్యాచరణ ప్రణాళిక

**పంచాయతీ మున్సిపాలిటీ: యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్యం**

**వైద్యశాఖ ఆశా వర్కర్లు: ఇంటింటి జ్వరాల సర్వే, అవగాహన**

**విద్యా సంక్షేమ శాఖలు: హాస్టల్స్, స్కూళ్లలో పరిశుభ్రత ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ అధికారిని, పాలకుడిని క్షమించే ప్రసక్తే లేదు.**

బడ్జెట్ సాకులు, సిబ్బంది కొరత నెపాలు చెప్పి తప్పుకుంటే చూస్తూ ఊరుకోబోం. యంత్రాంగం ఇప్పటికైనా తన కుంభకర్ణ నిద్రను వీడి క్షేత్రస్థాయిలోకి రావాలి. గద్వాల జిల్లాను సీజనల్ వ్యాధుల బారి నుండి కాపాడటంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా, జనం తిరగబడటం ఖాయం!

## డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట జూన్ 26 (వుదయం ప్రతినిధి)



డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెడు వ్యస నాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టా లని, యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి ఎచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎస్పీ డా వినీత్ లు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తోటి వారూ ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య దశలో బంగారు భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఫ్రెండ్స్ , ఎంజాయ్ అంటూ ఇప్పుడు తిరిగితే మన సమయం బాగా లేనప్పుడు మనకు తోడుగా ఎవ్వరూ రారని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. మిమ్మల్ని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేట్ ఈగల్ ఫోర్స్ టీం డ్రగ్స్ పై దాడులు నిర్వహిస్తున్నాయని, ప్రజలు యువత వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్ట్ లాంటివని, ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు. యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని, ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ అనేది జాతీయ భద్రతకు భంగం కలిగించేలా చేస్తుందని, అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్,ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రి, కృష్ణ చైతన్య, ఎక్సైజ్ ఎస్ఐలు,మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జూన్ 28 నుండి పోలియో చుక్కలు



మరికల్ జూన్ 26 (వుదయం ప్రతినిధి)

మరికల్ మండల కేంద్రంలోని శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర జాతీయ టీకా దినోత్సవ సందర్భంగా జూన్ 28 నుండి 30 వరకు పోలియో చుక్కలు ప్రారంభమవుతారని వైద్యాధికారి డాక్టర్ రాఘవేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు పోలియో చుక్కలు పుట్టిన పిల్లవాడి నుండి ఐదు సంవత్సరాల వరకు ప్రతి ఒక్కరు చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన అన్నారు పోలియో వ్యాప్తి నిరోధిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఐదు సంవత్సరాల లోపు పిల్లలు బూతుకు తప్పనిసరి తీసుకు వెళ్లి ఉచితంగా అంగన్వాడి సిబ్బంది మరియు స్వచ్ఛంద నాయకులు భౌతిక రాని వాళ్ళు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని ఆయన అన్నారు డాక్టర్ అన్నారు పి హెచ్ సి మరికల్ మండల కేంద్ర పరిధిలోని 18 గ్రామ పంచాయతీలో ఏడు ఉప కేంద్రాలు మరియు మూడు ప్రధాన భరిత ప్రాంతాలలో పోలీసులకు ప్రాధమిస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమానికి అంగన్వాడీలు మరియు డాక్టర్లు నర్సులు పాల్గొంటారని ఆయన తెలిపారు

## మురికి కూపాలుగా సాంఘిక సంక్షేమ హాస్టళ్లు

- విద్యార్థులను వెంటనే తరలించాలి
- నూతన భవనం నిర్మించాలి సీపీఎం

నాగర్ కర్నూల్, జూన్ 26 (వుదయం ప్రతినిధి):



జిల్లా కేంద్రంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్ శిథిలావస్థకు చేరి మురికి కూపంలా మారిందని, విద్యార్థులను వెంటనే వేరే హాస్టల్‌కు తరలించి నూతన భవనం నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సర్వేలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను పార్టీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ హాస్టల్ దీనస్థితి, విద్యార్థుల బాధలు కళ్లకు కట్టినట్లు కనిపించాయని ఆవేదన వ్యక్తం చేశారు.స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా పాలకుల అసమర్థ విధానాల వల్ల సాంఘిక సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు అవుతున్నా విద్యార్థులకు ఇప్పటివరకు పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేదికలపై హాస్టళ్లకు వేల కోట్లు ఇస్తున్నామని చెబుతున్నా సొంత జిల్లాలోనే పరిస్థితి దయనీయంగా ఉందని మండిపడ్డారు. ఊడిపోయిన తలుపులు, దుర్గంధం వెదజల్లుతున్న మరుగుదొడ్లు, అపరిశుభ్ర పరిసరాలు, విరిగిన తలుపులు, వంగిపోయిన ఫ్యాన్లు, పెచ్చులూడిన స్లాబ్‌లు, వేలాడుతున్న ఇనుప చువ్వలు, జాలీ లేని కిటికీలతో హాస్టల్ సమస్యలకు నిలయంగా మారిందన్నారు.సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నిర్లక్ష్యం, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు పట్టించుకోకపోవడంతో చదువుకునే వాతావరణం లేకుండా పోయిందని ఆరోపించారు. హాస్టళ్లలో అధికారులు, ఎమ్మెల్యేలు బస చేయాలని సీఎం చెప్పినా అది కేవలం పిక్నిక్ టూర్‌లా మారిందని, అధికారులు వచ్చినప్పుడు మాత్రమే హంగామా చేసి సున్నాలు వేసి, క్లీనింగ్ చేస్తే సరిపోదని, నిత్యం పర్యవేక్షణ ఉంటేనే హాస్టళ్లు బాగుపడతాయని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులను వేరే హాస్టల్‌కు తరలించాలని, నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మధు, సురేష్, సుభాష్, కురుమయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతిక మొహరం

- మాజీ జెడ్పిటిసి ప్రముఖ సంఘ సేవకులు పబ్బ మహేష్ గుప్తా.....

మెదక్ \శివ్వంపేట జూన్ 26(వుదయం న్యూస్):



మెదక్ జిల్లా సోంపేట మండలం ప్రముఖ సంఘ సేవకులు మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా. వుదయం దినపత్రిక ద్వారా పీర్ల పండుగ విశిష్టత గురించి ఆయన వివరిస్తూ. సాంప్రదాయకంగా అనేక శతాబ్దాలుగా, "ఇస్లామిక్ సహచరులు"గా పిలువబడే సున్నీ ఇస్లామీయ పండితులు, తమ అనుచరులను ఇమామ్ హుస్సేన్, అతని కుటుంబ సభ్యులు,సహచరుల త్యాగాన్ని స్మరించుకునే కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రోత్సహిస్తూ ఉన్నారు. ఈ సందర్భాలలో, వారు సలాహ్ (ప్రార్థన)లు నిర్వహించడమే కాకుండా, ప్రవక్త ముహమ్మద్ ద్వారా అహ్లె అల్‌బైత్పై ఉల్లేఖించిన ఖురాన్ వచనాలు, హదీసులను పఠిస్తూ, నిశ్శబ్దంగా సంతాపం వ్యక్తపరిచి కన్నీటి నివాళులు అర్పిస్తారు.ఈ ప్రక్రియలో శరీరదండన లేదా స్వీయవేదన (ధ్వజమెత్తడం) జరగదు. ఇది ఇమామ్ హుస్సేన్ మరణించిన దినమైన ఆశురా నాడు జరిగే ప్రధాన కార్యచరణల్లో ఒకటిగా పరిగణించబడుతుంది.ఈ రోజున, షియా (ఇమామ్ హుస్సేన్ అనుచరులు) ఆయన చేసిన బలిదానాన్ని స్మరించుకుంటూ, తమను తామే శరీరంపై కొట్టుకుంటూ లేదా స్వీయ వేదన కలిగిస్తూ సంతాపాన్ని వ్యక్తం చేస్తారు.గత కొన్ని దశాబ్దాలుగా, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల్లో "పీర్ల పండుగ" అనే సాంప్రదాయ సంతాప పర్వదినాన్ని ముస్లింలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంలో, సున్నీ ముస్లింలు ఇమామ్ హుస్సేన్ జ్ఞాపకార్థంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించగా, షియా ముస్లింలు మొహర్రం నెల మొత్తంలో, ముఖ్యంగా ఆశురా రోజున, తమ శరీరాలను స్వీయవేదనకు ఆశురా రోజున. తమ శరీరాలను స్వీయ వేదనకు లోను చేసి రక్తస్రావం సంతాపాన్ని ప్రకటిస్తారు అని ఆయన వివరించారు.



## పార్కులు ప్రజల ఆరోగ్యానికి భవిష్యత్ తరాల ఆనందానికి చిరునామా

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- అమీన్పూర్ డివిజన్ పరిధిలో ఒక కోటి 51 లక్షల రూపాయలతో మూడు పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..

అమీన్పూర్ (వుదయం):

పార్కులు ప్రజల ఆరోగ్యానికి. భవిష్యత్తు తరాల ఆనందానికి చిరునామాగా నిలుస్తాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

శుక్రవారం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, హెచ్ఎంటి శిల్ప లేఔట్ కాలనీ, పిఎన్ఆర్ కాలనీలలో ఒక కోటి 51 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో గల ప్రతి పార్కు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఆహ్లాద వాతావరణంలో పాటు పచ్చదనం పెరగడంతో పాటు కాలనీలలో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. ప్రతి పార్కులో పిల్లలకు ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు..ఈ కార్యక్రమాల్లో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ సురేష్, డి ఈ వెంకటరమణ, పార్కుల విభాగం మేనేజర్ సతీష్, మాజీ కౌన్సిలర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్, జగదీష్, కృష్ణ, మహదేవ రెడ్డి, రాములు, బిజిలి రాజు, కాట సునీత, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వినియోగం కుటుంబాలు, సమాజం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది





- తెలంగాణా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ జూన్ 26 (వుదయం బ్యూరో)

మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలంగాణా రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారము అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్ పి ఆధ్వర్యంలో 2K రన్ మరియు అవగాహన సమావేశం వికారాబాద్ జిల్లా బ్లాక్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ డ్రగ్స్ అనేది ఒక మహమ్మారి, సరదాగా మొదలయ్యి, వ్యసనంగా మారి జీవితాలను సర్వనాశనం చేస్తుంది. ముఖ్యంగా బంగారు భవిష్యత్తు ఉన్న యువత సాలెగూడు లాంటి డ్రగ్స్ ఊబిలో చిక్కుకొని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఇంట్లో ఒక్కరు డ్రగ్స్ కు బానిసలు అయితే ఆ వ్యక్తితో పాటుగా ఆ కుటుంబం కూడా నాశనం అవుతుంది, చిన్నాభిన్నం అవుతుంది. ఆర్థికంగా అప్పులపాలు అవ్వడంతో పాటుగా అనారోగ్యాల పాలవుతారు. డ్రగ్స్ అలవాటు ఉన్న వ్యక్తులకు సమాజంలో గౌరవం ఉండదు. ఏ విధంగా చూసినా మాదకద్రవ్యాలతో అన్ని నష్టాలు ఉంటాయి. అందుకే అందరు కూడా వాటికి దూరంగా ఉండాలి. మనకు తెలిసిన వారు ఎవరైనా డ్రగ్స్ వాడుతుంటే వారికి అవగాహన కల్పించే బాద్యత మన అందరి పై ఉందన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ 2K రన్‌ను జెండా ఊపి ప్రారంభించి,బ్లాక్ గ్రౌండ్ నుండి ఏం ఆర్ పి చౌరస్తా వరకు 2 k రన్ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యాసంస్థలు మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఎస్ పి స్నేహ మెహర, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ,అధికారులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించి, వాటి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిన్న నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య,SP స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజు గూటూరు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, AMC చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహా రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలుపాల్గొన్నారు



## వర్షా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సంగారెడ్డి కమిషనర్

సంగారెడ్డి, జూన్ 26:వు దయం.

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.శుక్రవారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.

తాగునీటిని మరిగించి వినియోగించాలని, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, ప్రజలు కూడా సహకరించి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ కోరారు.



## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్

మహబూబ్ నగర్ జూన్ 26 (వుదయం ప్రతినిధి)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో (ఎస్.ఐ.ఆర్ 20 26) లో భాగంగా జిల్లాలో శుక్రవారం వివిధ మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటించి ఇంటింటి కి ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ ప్రక్రియ ను పర్యవేక్షించారు. భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో దేవరకద్ర గ్రామం, మండలం, కౌకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామం లో చిన్నచింతకుంట గ్రామం,మండలం అడ్డాకల్ గ్రామం, మండలం, కోమిరెడ్డిపల్లి గ్రామం మూసాపేట్ మండలం కోమిరెడ్డిపల్లి గ్రామం లలో సర్ ఎన్యూమరేషన్ ఫారం ల పంపిణీ పరిశీలించి మండలాలలోని తహశీల్దార్ లు ,బి. ఎల్.ఓ లు సూపర్వైజర్లు తో చర్చించి సూచనలు చేశారు.దేవరకద్ర కె.జి. బి.వి తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ దేవరకద్రలోని కె.జి.బి.వి ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారంతనిఖీ చేశారు. కె.జి.బి.వి లో వంటగదిని,హాస్టల్ ప్రాంగణాన్ని పరిశీలించి ఆహార తయారీ నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. అలాగే, వసతి, ఆహారం, పారిశుధ్యం, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థుల నుండి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు హాస్టల్ సౌకర్యాలకు సంబంధించిన తమ అనుభవాలను అదనపు కలెక్టర్ కు వివరించారు.

## తాండూరు జిల్లా ఆసుపత్రిలో విషాదం



- పీఎఫ్ ఇవ్వలేదని పారిశుద్ధ్య కార్మికురాలు ఆత్మహత్యాయత్నం!
- వినాయక ఏజెన్సీ నిర్లక్ష్యమే కారణం.. పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించని వైనం

తాండూరు వుదయం ప్రతినిధి జూన్26-:

తాండూరు జిల్లా ఆసుపత్రిలో తీవ్ర కలకలం రేగింది. ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న హన్మమ్మ తనకు రావలసిన పీఎఫ్ డబ్బులు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై, శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం తాండూర్ జిల్లా ఆస్పత్రిలో చోటుచేసుకుందిబాధ్యులపై చర్యలు: ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పేద కార్మికులను మానసిక క్షోభకు గురిచేసి, ఆత్మహత్యకు ప్రేరేపించేలా వ్యవహరించిన నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలి.బ్లాక్ లిస్ట్ హెచ్చరిక: ఈ నోటీసులకు ఏజెన్సీ యాజమాన్యం సరైన కాలపరిమితిలోగా తగిన వివరణ ఇవ్వని యెడల, సదరు ఏజెన్సీ కాంట్రాక్ట్‌ను రద్దు చేయడమే కాకుండా, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాము అన్నారుకార్మికురాలికి అండగా ఉంటాం: సూపరింటెండెంట్ వినయ్

ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ స్వయంగా పర్యవేక్షించారు. ఆమెకు మెరుగైన ఉచిత వైద్యం అందుతుందని,ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఆసుపత్రి యాజమాన్యం పూర్తి అండగా ఉంటుందని, ఏజెన్సీ నుండి రావలసిన పీఎఫ్ సొమ్ముతో పాటు అన్ని రకాల బకాయిలను త్వరలోనే ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని పరిశుద్ధ కార్మికులకు హామీ ఇచ్చారు.ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా ఆసుపత్రి అంతర్గత కమిటీని కూడా సూపరింటెండెంట్ వినయ్ ఆదేశించారు. *వినాయక ఏజెన్సీ నిర్వాహకుల ముఖంచాటు: ఫోన్ చేసినా స్పందించని వైనం!తప్పు ఒప్పుకున్నట్లేనా..? సర్వత్రా ఆగ్రహం!ఓ పేద కార్మికురాలు ప్రాణాల మీదికి తెచ్చుకున్నా ఏజెన్సీ ప్రతినిధుల్లో కనీస చలనం లేకపోవడం, పైగా వివరణ కోరితే ఫోన్లకు కూడా దొరకకుండా తప్పించుకు తిరగడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. తప్పు చేశారు కాబట్టే సమాధానం చెప్పలేక తప్పుకుంటున్నారని, సదరు వినాయక ఏజెన్సీపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని తోటి కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.*

## దౌలాపూర్‌లో అంగరంగ వైభవంగా పీర్ల పండగ

- మతసామరస్యానికి నిలువుటద్దం!

జగదేవపూర్ (దౌలాపూర్): జూన్ 26 (వుదయం ప్రతినిధి)

సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రజలందరూ ఏకమై ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడి వద్ద ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను ప్రతిష్టించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు తమ కోర్కెలు తీరాలని పీర్ల స్వాములకు 'కందురు'లు (నైవేద్యాలు) సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ వీధుల గుండా పీర్ల ఊరేగింపు సాగుతుండగా, యువకులు, పెద్దలు 'హుస్సేన్.. దులహా..' అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. ఈ వేడుకను కళ్లారా చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఆకట్టుకున్న పీర్ల ఊరేగింపు మతసామరస్య వేదుక: దౌలాపూర్ గ్రామంలో జరిగిన పీర్ల పండుగ ఉత్సవాల్లో భాగంగా రంగురంగుల పట్టు వస్త్రాలు, కిరీటాలతో అలంకరించిన పీర్లను (అలమ్‌లను) భక్తులు భుజాలపై మోస్తూ ఊరేగించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి వేళలో భక్తిభావం ఉట్టిపడేలా సాగిన ఈ ఊరేగింపు, గ్రామంలో హిందూ ముస్లింల బంధాన్ని, సాంప్రదాయక వైభవాన్ని చాటిచెప్పింది.



## నల్లపోచమ్మ ఆలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పూజలు

- హారతి తీసుకుంటున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి.....

వుదయం న్యూస్, శివ్వంపేట, జూన్ 26.



శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామంలో శుక్రవారం నల్లపోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమానికి మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అమ్మవారి దీవెనలతో పాడిపంట బాగుండాలని కోరుకున్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరిహరికృష్ణ, జడ్పీ మాజీ కోఆప్షన్ మన్సూర్, ఉపసర్పంచ్ పాపయ్యచారీ, మాజీ సర్పంచ్ బాలమణినరేందర్, మాజీ ఎంపీటీసీ నువ్వుల దశరథ, సీనియర్ నాయకులు యాదాగౌడ్, మహిపాల్రెడ్డి, పంచమి రేణుకుమార్, నర్సింహారెడ్డి, భిక్షపతిరెడ్డి, మర్రి మహేందర్రెడ్డి ఉన్నారు.



# వేములవాడలో ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవం

– ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

వేములవాడ, జూన్ 26 టవుదయం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవతలు, కులదేవతలకు ప్రతి ఏడాది బోనాలు సమర్పించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. గ్రామాలకు ఎలాంటి ఆపదలు, అనర్థాలు కలగకుండా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుతూ నిర్వహించే బోనాల వేడుకలు ప్రజల్లో భక్తి, ఐకమత్య భావాలను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కటాక్షంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండాలని, రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బోనాల మహోత్సవానికి ఆహ్వానించి, తమను భాగస్వాములను చేసిన ముదిరాజ్ సంఘం నాయకులకు ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియామకం



కరీంనగర్ జూన్26 (వుదయం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధికారిక నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాపాక ప్రవీణ్ గతంతో మానకొండూర్ మండల అధ్యక్షునీగా పనిచేశారు. ప్రస్తుతం లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ గా, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్ హోదాలో కొనసాగుతున్నారు.

ఎస్సీ వర్గాల సమస్యలకోసం, జిల్లాలో ఎస్సీ మోర్చా విభాగం మరింత బలోపేతం చేయడానికి,కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని రాపాక ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపారు. , పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జిల్లాలో ఎస్సీ మోర్చాను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని, . తన నియామనకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు అందరికీ ధన్య వాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు.

# సోదర భావానికి ప్రతీక మొహర్రం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురిలో పీరీలను దర్శించుకు ని మొక్కులు చెల్లించుకున్న మంత్రి అడ్లూరి





ధర్మపురి,జూన్ 26(వుదయం ప్రతినిధి):మొహర్రం పండుగ హిందూ,ము స్లింల నడుమ సోదర భావానికి,మతసామర స్యానికి సజీవ ప్రతీక అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్ర వారం ధర్మపురి క్షేత్రంలో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించిన మొహ ర్రం వేడుక ల్లో ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ నంది చౌరస్తాలో ప్రతి ష్టించిన పీరీలను మంత్రి దర్శించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మొక్కు లు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై దశాబ్దాలు గా హిందూ,ముస్లింలు అన్నద మ్ముల్లా కలిసిమెలిసి పీర్ల పండు గను జరుపుకోవడం ఇక్కడి విశిష్ట సంస్కృతికి అద్దం పడుతోందన్నా రు. మన ప్రజాస్వామ్య దేశంలో భిన్న త్వంలో ఏకత్వమే మన బలం. పూర్వీ కుల నుంచి వస్తున్న ఈ గంగా–జమునా తెహజీబ్ సంస్కృతిని, సామరస్యాన్ని కాపాడుకుంటూ భావి తరాలకు అందిం చాల్సిన బాధ్యత మనంద రిపై ఉ ంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి..బీఆర్ఎస్ నేతలు



వేములవాడ, జూన్ 26 టవుదయం ప్రతినిధిఊ : జిల్లాలో వెలుగుచూసిన ధాన్యం కుంభకోణం రూ.91 లక్షలకే పరిమితం కాదని, రూ.3 నుంచి రూ.4 కోట్ల మేర అక్రమాలు జరిగి ఉండొచ్చని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, రుద్రంగి మండల నాయకుడు చెప్యాల గణేష్ మాట్లాడుతూ మల్కపేట గ్రామ ఐకేపీ కేంద్రంలో ధాన్యం బస్తాల అక్రమ రవాణా ఘటనలో కాంగ్రెస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ పాత్ర ఉందని ఆరోపించారు. ఘటన బయటపడిన అనంతరం రాత్రికి రాత్రే 467 ధాన్యం బస్తాలను సిరిసిల్ల గోదాముకు తరలించే ప్రయత్నం జరిగిందని, అధికారులు 378 బస్తాలను మాత్రమే దించగా, మిగిలిన 89 బస్తాల వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గ్రామ సర్పంచ్ బోయిని దేవరాజు పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, అనంతరం ధాన్యం బస్తాల వ్యవహారం సద్దుమణిగే వరకు అక్కడే ఉండడం వెనుక కారణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ధాన్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జంగిటి శ్రీనివాస్, గడ్డం స్వామి అలియాస్ నరసారెడ్డికి కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సన్నిహితులుగా ఉన్నవారే ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. చల్మెడ లక్ష్మీనరసింహారావుపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, ధాన్యం కుంభకోణంపై నిష్పాక్షికంగా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, ఆకుల గంగారం, మల్యాల దేవయ్య, నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, మారం కుమార్, అంజద్ పాషా, సుంకపాక రాజు, సందీప్, కనకయ్య, పబ్బ మహేష్, ప్రేమ్ చారి, సంజీవ్, ఉప్పులుటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



పెద్దపెల్లి , జూన్ 26 (వుదయం కస్పాండెంట్):మంథని పట్టణంలోని పవర్ హౌస్ కాలనీలో ఇటీవల మరణించిన పుల్లె స్వామి, సిరికొండ రత్తమ్మ కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ముత్తారం మండల కేంద్రానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, ఇటీవల మరణించిన రాగుల నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి మంథని మండలం సిద్ధపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్పుల మణికంఠ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల మరణించిన ఎల్పుల చంద్రయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించిన పుట్ట మధూకర్, ఈ క్లిష్ట సమయంలో పార్టీ తరఫున తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంకితభావానికి అగ్రతాంబూలం.. సంతోష్ బాబుకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు



వేములవాడ, జూన్ 26 వుదయం ప్రతినిధిఊ : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన మాజీ కౌన్సిలర్, పార్టీ సీనియర్ నాయకుడు రేగుల సంతోష్ బాబును పార్టీ రాష్ట్ర నాయకత్వం నియమించింది. పార్టీ కోసం దీర్ఘకాలంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ సంస్థాగత బలోపేతానికి కృషి చేసిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడం పార్టీ ఆయన సేవలకు ఇచ్చిన గుర్తింపుగా నాయకులు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులను ప్రకటించారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా రేగుల సంతోష్ బాబును నియమించారు. ఈ సందర్భంగా సంతోష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఓబీసీ మోర్చాను గ్రామస్థాయి వరకు విస్తరించడంతో పాటు పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తానని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడమే కాకుండా ఓబీసీ వర్గాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రేగుల సంతోష్ బాబు నియామకాన్ని పార్టీ శ్రేణులు స్వాగతించాయి. ఆయన నాయకత్వంలో జిల్లాలో బీజేపీ ఓబీసీ మోర్చా కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం అక్రమాలపై కేసు నమోదు

**11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు.. దర్యాప్తు ప్రారంభం: పీఏసీఎస్ సీఈఓ మామిడాల అశోక్**

మంథని, జూన్ 26 ( వుదయం ప్రతినిధి)మంథని మండలం మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం (పీపీసీ)లో జరిగిన అక్రమాల వ్యవహారంలో 11 మందిపై మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ మామిడాల అశోక్ తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలు, సివిల్ సప్లైస్ శాఖ తనిఖీ నివేదికలు, పంచనామా, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు క్రైమ్ నెం.137/2026గా భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్లు 318(4), 316(4), 316(5), 338, 61(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టగా పలు అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. విచారణలో భాగంగా లారీ డ్రైవర్లు, సిబ్బంది వాంగ్మూలాలు నమోదు చేయగా, స్థానిక రైతుల వద్ద నుంచి కాకుండా ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి ధాన్యాన్ని తరలించి స్థానికంగా కొనుగోలు చేసినట్లుగా చూపించేందుకు నకిలీ ట్రక్ చిట్లు జారీ చేసినట్లు తేలిందన్నారు. ట్యాబ్ ఆపరేటర్ ఆర్థిక ప్రయోజనాల కోసం నకిలీ ట్రక్ చిట్లు జారీ చేసినట్లు, స్టాఫ్ అసిస్టెంట్ అక్రమ ధాన్యం రవాణాకు సహకరించినట్లు వెల్లడైందన్నారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ప్రమేయం లేకుండా ఈ వ్యవహారం జరగడం అసాధ్యమని, మొత్తం ఘటనలో కుట్ర కోణం ఉన్నట్లు విచారణలో గుర్తించినట్లు తెలిపారు.

ఈ మేరకు మల్లేపల్లి పీపీసీ ఇన్‌చార్జి బి. సందీప్, ట్యాబ్ ఆపరేటర్ తాటి నరేష్, ప్యాక్స్ స్టాఫ్ అసిస్టెంట్ ఎస్. నరేష్, వాహన యజమానులు తల్ల అంజి, తల్ల శేఖర్, రమేష్, లారీ డ్రైవర్లు పిట్టల అర్జున్ కార్తికేయ, కొలకని రవికుమార్, ఎస్. నరేష్ సోదరుడు ఎస్. హరీష్, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ నివేదికలో అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి పేర్కొన్న కడియాల రాకేష్, తాటి రేణికతో పాటు దర్యాప్తులో ప్రమేయం ఉన్న ఇతరులపై ఫిర్యాదు చేసినట్లు సీఈఓ తెలిపారు. తనిఖీల్లో ూ్రా24ుదీ0057, ు+07జ0456, ూ25ు1819 నంబర్ల లారీల్లో తరలిస్తున్న 2,213 బస్తాలు (885.20 క్వింటాళ్లు) ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.20.97 లక్షలుగా అంచనా వేశారు. అదేవిధంగా ఎనిమిది నకిలీ ట్రక్ చిట్ల ద్వారా 5,421 బస్తాలు (2,168.40 క్వింటాళ్లు), సుమారు రూ.51.39 లక్షల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు వ్యవస్థను దుర్వినియోగం చేసి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడంతో పాటు నిజమైన రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మామిడాల అశోక్ తెలిపారు. ఈ వ్యవహారంపై మంథని పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.





# భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

– విశేష పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించిన భక్తజనం.

వేములవాడ, జూన్ 26 ( వుదయం ప్రతినిధి ): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కోడె మొక్కులు, రుద్రాభిషేకం, అన్నపూజ, నిత్య కల్యాణం, చండీ హోమం, కుంకుమ పూజ తదితర విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయం రోజంతా భక్తుల రద్దీతో సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉ ంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం, పూజా కార్యక్రమాలు సజావుగా సాగేలా క్యూలైన్ల నిర్వహణతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి రమాదేవి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ సిబ్బంది సేవలు అందించారు. శుక్రవారం, ప్రభుత్వ సెలవు నేపథ్యంలో రోజంతా ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుని ఆధ్యాత్మిక ఆనందంతో తిరుగు ప్రయాణమయ్యారు.

# త్యాగానికి మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ


## మసీదులో మొక్కులు చెల్లించిన భక్తులు



ధర్మపురి జూన్ 26,(వుదయం ప్రతినిధి): త్యాగానికి మత సామరస్యా నికి ప్రతీకగా నిలిచే పండుగమొహర్రం. మొహర్రం వేడుకలు అన్ని మతాలకు అతీతంగా చిన్న పెద్ద తేడా లేకుండా ధర్మపురి పట్టణంలోని అషర్ (మసీదు)లో భక్తి శ్రద్దలతో గత పది రోజుల నుండి వేడుకలు సాగగా చివరి రోజు శుక్రవారం స్థానిక నంది చౌరస్తా వద్ద మసీదులో మత పెద్దల ఆధ్వర్యంలో పీరీలు నిప్పుల గుండం పై నడవగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. అనంతరం పీరీలు,నాల్ సాబ్ లు ప్రధాన విధుల్లో తిరుగగా భక్తులు కుడుక పేర్లు వేసి మొక్కులు చెల్లిం చు కున్నారు. పట్టణంలోని సారగ మ్మ వాడ,తెనుగువాడ మసీదుల లో కూడా మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఆయుర్ ఖానాల ముజాఫర్ లు మహమ్మద్ తాజ్,ఎస్ కె సంయుద్దీన్,ఎస్ కె కాశీమ్, ఎండి అఫీస్, ఎండి ఆదిల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద పులి వేషధారణలతో దూల ఆడుతూ భక్తిని చాటారు. ఈ సందర్భంగా అన్ని పార్టీల నాయ కులు, ప్రజా ప్రతినిధులు, అధికా రులు, గ్రామ ప్రజలు మొహర్రం వేడుకలకు హాజరై మొక్కులు చెల్లించు కున్నారు. సాయంత్రం పీర్లు,నాల్ సాబ్ లు పురవీధుల్లో ఊరేగింపుతో వెళ్లి గోదావరిలో నిమర్జన చేశారు. ఈ కార్యక్ర మంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాం నరసింహా రెడ్డి పర్యవేక్షణలో ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మంత్రి శ్రీధర్ బాబు పై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు


:మాజీ విప్ ఆరెపల్లి మోహన్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ జూన్ 26 (వుదయం ప్రతినిధి): మంత్రి శ్రీధర్ బాబు పై బిఆర్ఎస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకోనిది లేదని కాంగ్రెస్ నేతలు తెగేసి చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష విఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మరియు ప్రభుత్వంపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని ఆరెపల్లి మోహన్ మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీలో అవకతవకలు జరిగాయని మంత్ర శ్రీధర్ బాబు అవినీతికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీధర్ బాబు పై చేశాన అవినీతి ఆరోపణలపై మీ దగ్గర సాక్షాలు ఉన్నట్లయితే నేను శాశ్వతంగా రాజకీయాలనుండి తప్పుకుంటాను అని ఆరెపల్లి మోహన్ టిఆర్ఎస్ నాయకులకు సవాల్ చేశారు. ఒకవేళ నిరూపించినట్లయితే జీవన్ రెడ్డి రాజకీయాల నుండి తప్పుకుంటారా. మంథని ప్రాంతంలో గత ప్రభుత్వాలు విచ్చలవిడిగా ఇసుక దందా చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని మండిపడ్డారు. టిఆర్ఎస్ పాలనలో దళిత బంధు పథకాన్ని కేవలం హుజురాబాద్ మాత్రమే ఎందుకు పరిమితం చేశారు రాష్ట్రవ్యాప్తంగా ఎందుకు అమలు చేయలేదు దీని గురించి బిఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడలేదు అని ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వము అని ప్రజల కోసం పనిచేస్తుందని హామీ ఇచ్చిన పథకాలన్నీ కూడా అమలు చేస్తామని సందర్భంగా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ తో పాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓ గుప్పెడు చాలు..!

సాయంత్రం స్నాక్స్.. ఓ ఆరోగ్యకరమైన అలవాటు. అయితే, చాలామంది సూపర్ మార్కెట్లలో దొరికే బిస్కెట్స్‌నే ఎక్కువగా తీసుకుంటారు. వీటి వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అంతంత మాత్రమే! అందుకే, స్నాక్స్‌గా స్తాయి. అదే.. నట్స్‌లో ఒమేగా–3 లాంటి శరీరానికి మేలుచేసే ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరిచి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండెను మరింత పటిష్టంగా మారుస్తాయి.



డ్రైఫ్రూట్స్‌ను తీసుకుంటే మంచిదని అంటున్నారు నిపుణులు. కనీసం 30 రోజులపాటు బిస్కెట్లను పక్కన పెట్టి.. ఓ గుప్పెడు నట్స్ తింటే శరీరంలో అద్భుతమైన మార్పులు వస్తాయని చెబుతున్నారు. బిస్కెట్లలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. ఎన్నితిన్నా.. కడుపు నిండిన భావన ఉండదు. అదే, నట్స్ తిన్నప్పుడు.. అందులోని ఫైబర్, ప్రొటీన్ వల్ల కడుపు త్వరగా నిండుతుంది. దాంతో, ఎక్కువ సమయం ఆకలి వేయకుండా ఉంటుంది. ఫలితంగా రోజూ తీసుకునే క్యాలరీల పరిమాణం తగ్గి, పొట్ట చుట్టూ ఉండే కొవ్వు కరగడానికి సహాయపడుతుంది. బిస్కెట్లలో మైదా, పంచదార ఎక్కువగా ఉంటుంది. అవి తిన్న వెంటనే శక్తి వచ్చినట్లు అనిపించినా.. అంతే వేగంగా బ్లడ్ షుగర్ పడిపోయి మళ్లీ నీరసంగా అనిపిస్తుంది. అదే నట్స్‌లో మంచి కొవ్వులు, ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. దాంతో, నెమ్మదిగా, స్థిరంగా శక్తి విడుదలవుతుంది. దీనివల్ల సాయంత్రం వచ్చే నీరసం తగ్గుతుంది. బిస్కెట్లలో 'ట్రాన్స్ ఫ్యాట్స్' (చెడు కొవ్వులు) ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెకు హాని కలిగి బిస్కెట్లలోని రిఫైండ్ షుగర్.. చర్మంపై మొటిమలు, ముడతల్ని పెంచుతుంది. కానీ, నట్స్‌లో ఉండే విటమిన్ ఇ, జింక్, యాంటి ఆక్సిడెంట్లు.. చర్మానికి మంచి పోషణను అందిస్తాయి. కేవలం ఒక నెలలోనే చర్మాన్ని మరింత ఆరోగ్యంగా, కాంతిమంతంగా మార్చేస్తాయి. బిస్కెట్లలోని మైదా వల్ల మలబద్ధకం వస్తుంది. అదే నట్స్ తీసుకోవడం వల్ల.. వాటిలోని పీచు పదార్థం పేగుల కదలికలను మెరుగుపరుస్తుంది. గ్యాస్, మలబద్ధకం లాంటి సమస్యలను దూరం చేస్తుంది. నట్స్ ఆరోగ్యానికి మంచివే.. కానీ, అతిగా తినకూడదు. రోజుకు ఒక గుప్పెడు సరిపోతుంది. ఇక ఒకే రకమైనవి తీసుకోకుండా.. మిక్స్‌డ్ నట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బాదం, పిస్తా, వాల్‌నట్స్, వేరుశనగలు.. ఇలా అన్నిటినీ కలిపి తీసుకోవడం మంచిది.

అందులోనూ మార్కెట్లో దొరికే సాల్టెడ్ (ఉప్పులో వేయించిన), మసాలా నట్స్ మాత్రం వద్దు. సహజమైన నట్స్ మాత్రమే ఎంచుకోవాలి.

# చక్కని ఆరోగ్యం

## ఉదయాన్నే నిద్రలేస్తే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు

రాత్రి త్వరగా నిద్రపోయి, ఉదయాన్నే త్వరగా లేవడం మంచి అలవాటు అని పెద్దలు చెబుతుంటారు. ఇలా చేయడం వల్ల రోజువారీ పనులను ప్రశాంతంగా పూర్తి చేసుకోవచ్చు. అంతేకాకుండా శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఈ రోజుల్లో చాలా మంది ఆలస్యంగా నిద్రపోయి, ఆలస్యంగా లేస్తున్నారు. ఈ అలవాటు బద్ధకాన్ని పెంచడమే కాకుండా కొన్ని ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తుంది. జీవనశైలిలో చిన్న మార్పు చేసి, త్వరగా నిద్రపోయి త్వరగా లేవడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉదయం ఆలస్యంగా లేస్తే పనులన్నీ తొందరపాటుగా చేయాల్సి వస్తుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. కానీ త్వరగా నిద్రలేస్తే పనులను ప్రశాంతంగా, సమయానికి పూర్తి చేసుకోవచ్చు. ఇది మనసును తాజా గా ఉంచి ఒత్తిడిని తగ్గిస్తుంది. ఉదయాన్నే లేవడం వల్ల వ్యాయామానికి సమయం దొరుకుతుంది. ఉదయం చేసే వ్యాయామం శరీరానికి శక్తిని అందించడంతో పాటు బరువు తగ్గడంలో



కూడా సహాయపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఉదయం సమయంలో గాలి స్వచ్ఛంగా ఉంటుంది. ఆ సమయంలో వాకింగ్ లేదా వ్యాయామం చేస్తూ లోతుగా శ్వాస తీసుకోవడం ఊపిరితిత్తులకు మంచిది. దీంతో శ్వాసకోశ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉదయాన్నే త్వరగా లేచే వారు సాధారణంగా రాత్రి కూడా త్వరగా నిద్రపోతారు. దీంతో వారి నిద్ర సమయానికి పూర్తవడంతో పాటు నిద్ర నాణ్యత కూడా మెరుగుపడుతుంది. ఉదయాన్నే లేచి ధ్యానం, నడక లేదా ప్రశాంతంగా గడపడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడి సానుకూల ఆలోచనలు పెరుగుతాయి. ఉదయాన్నే త్వరగా నిద్ర లేవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మనసు కూడా ఉల్లాసంగా ఉంటుంది. రోజును ఉత్సాహంగా ప్రారంభించడానికి ఈ అలవాటు ఎంతో ఉపయోగపడుతుంది.

## తలస్నానానికి ఇటాలియన్ చిట్కా!

ప్రతి ఇంట్లోనూ తరవాతి తరాలకు కొన్ని చిట్కాలు, జాగ్రత్తలు వారసత్వంగా అందిస్తుంటారు కదా! అలా ఇటాలియన్లు చిన్నప్పట్నుంచి కేశ సంరక్షణను అలవాటు చేస్తారట. అందులో ప్రధానమైనది తలస్నానం ఎలా చేయాలన్నదే! అందులో కురుల శుభ్రత, ఆక్సిజనేటెడ్ స్కాల్ప్, బలమైన కుదుళ్ల మీద ఎక్కువ దృష్టిపెడతారట. ప్రత్యేకంగా షాంపూని చేస్తారట. తలస్నానానికి గోరువెచ్చని నీటికే వీళ్ల ప్రాధాన్యం. కురులను నీటితో తడిపి... షాంపూని మొదట పాపిట్లో, ఆపై మాడు మధ్యలో, కుడి, ఎడమ పక్కల చివర్లో ముచ్చిళ్లలో పట్టిస్తారు. నూనెతో చేసినట్లు షాంపూని మృదువుగా మర్దనా చేస్తారు. గట్టిగా రుద్దకూడదు. అలాగే గోళ్లతో కాకుండా మునివేళ్లతోనే మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల మైక్రో సర్క్యులేషన్, ఆక్సిజనేషన్ జరుగుతాయట. దీంతో మాడు చర్మం ఆరోగ్యంగా తయారవుతుంది అంటారు అక్కడి అమ్మాయిలు. అలాగే ప్రతిసారి తలను రెండుసార్లు అంటాలట. తొలిసారి ఎక్కువ పరిమాణంలో షాంపూ ఉపయోగించాలి. తరవాతిసారి మాత్రం బాదం గింజ పరిమాణాన్ని మించొద్దట. తొలిసారి తలలోకి చేరిన దుమ్ము, నూనెలు వదిలితే... రెండోసారి లోతైన క్లెన్సింగ్ సాధ్యమవుతుంది అంటున్నారు. అలాగే షాంపూని రుద్ది వెంటనే నీళ్లు పోసేయకూడదు. కొద్ది నిమిషాలు వదిలేయాలి. అప్పుడే లోతైన శుభ్రత సాధ్యమని చెబుతున్నారు. తరవాత మాస్క్, కండిషనర్ వంటివి రాసినా ప్రభావవంతంగా పనిచేస్తాయి అంటున్నారు. అయితే ప్రతిసారీ షాంపూని రాసి వదిలేసే సమయం ఉండదు, జుట్టు పొడిబారుతుంది అనిపిస్తే వారానికోసారి అయినా అలా చేయమంటారు. బలమైన కురులు ఆరోగ్యకరమైన మాడుతోనే సాధ్యమనేది ఇటాలియన్ల నమ్మకం. కాబట్టే, షాంపూ ప్రక్రియకు వీళ్లింత ప్రాధాన్యమిస్తుంటారు. అది వాళ్లకు చాలా సాయపడుతుంది కూడానట. మీరూ ఓసారి ప్రయత్నించి చూడండి మరి.



## గోళ్ల శుభ్రతే ఆరోగ్యం

ఆరోగ్యం పట్ల ఎంత జాగ్రత్తగా ఉన్నా.. చిన్న చిన్న తప్పులు పెను ముప్పులకు దారితీస్తాయి. ముఖ్యంగా చాలామంది గోళ్ల విషయంలో అశ్రద్ధ వహిస్తుంటారు. ఈ కారణంగా రకరకాల



రుగ్మతలు పలకరిస్తాయి. మనదేశంలో అందరం చేత్తో భోజనం చేస్తాం కాబట్టి గోళ్లు శుభ్రం చేసుకోవడం అత్యంత అవసరం. లేదంటే రకరకాల బ్యాక్టీరియా పెరిగేందుకు గోళ్లే స్థావరంగా మారిపోతాయి. భోజనం తినే ముందు, తిన్న తర్వాత చేతులతో పాటు గోళ్ల సందులను కూడా శుభ్రంగా కడుక్కోవాలి. ఆరోగ్యంపట్ల ఎంత జాగ్రత్తగా ఉన్నా.. చిన్న చిన్న తప్పులు పెను ముప్పులకు దారితీస్తాయి. ముఖ్యంగా చాలామంది గోళ్ల విషయంలో అశ్రద్ధ వహిస్తుంటారు. ఈ కారణంగా రకరకాల రుగ్మతలు పలకరిస్తాయి. మనదేశంలో అందరం చేత్తో భోజనం చేస్తాం కాబట్టి గోళ్లు శుభ్రం చేసుకోవడం అత్యంత అవసరం. లేదంటే రకరకాల బ్యాక్టీరియా పెరిగేందుకు గోళ్లే స్థావరంగా మారిపోతాయి. భోజనం తినే ముందు, తిన్న తర్వాత చేతులతో పాటు గోళ్ల సందులను కూడా శుభ్రంగా కడుక్కోవాలి.

## 'డాష్ డైట్' తెలుసా?

మారుతున్న జీవనశైలి మహిళల్లో అనేకరకాల వ్యాధులకు కారణం అవుతోంది. మూడు పదులు దాటాక ఒక్క దీర్ఘకాలిక వ్యాధి వచ్చినా... కాలక్రమంలో దానికి రెండు మూడు తోడవుతున్నాయి. ఇలా వచ్చే వ్యాధుల్లో అధికరక్తపోటు, డయాబెటీస్, గుండెజబ్బులు ముఖ్యమైనవి. ఇవి మీ జీవితంలో భాగం కాకూడదన్నా, ఇప్పటికే వీటి బారిన పడినవాళ్లు నియంత్రణలోకి తెచ్చుకోవాలన్నా 'డాష్ డైట్'ని ఫాలో అవ్వాల్సిందే అంటున్నారు నిపుణులు. డాష్ అంటే అధిక రక్తపోటును ఆపడానికి వీలైన ఆహార పద్ధతులు (డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్‌టెన్షన్) అని అర్థం. దీనిలో పోషకాలు అధికంగా ఉండే సంపూర్ణ ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. సోడియం, కొవ్వులు, అదనపు చక్కెర్లను తగ్గిస్తూ పోషకాలు, ఖనిజాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడమే దీని ప్రత్యేకత. దీనిలో కెలోరీలను లెక్కించాల్సిన అవసరం లేదు. అయితే సాధారణ బియ్యం కంటే... బ్రౌన్‌రైస్, ఓట్స్, హోల్ వీట్ బ్రెడ్ వంటి వాటిపై దృష్టిపెట్టాల్సి ఉంటుంది. పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. రక్తపోటు నియంత్రణకు ఉపయోగపడే పండ్లనూ ఆహారంలో భాగం చేసుకోవాలి. పాలు, పెరుగు, జున్ను వంటివి మితంగా తీసుకోవాలి. గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఆలివ్ నూనెను వాడాల్సిందిగా సిఫార్సు చేస్తారు. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలోనూ ఈ డైట్ సహాయపడుతుంది. బరువు తగ్గే అవకాశాలూ ఎక్కువే. పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటివి సమృద్ధిగా ఉండటం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు, పక్షవాతం వంటి వాటి నుంచి రక్షణ లభిస్తుంది. అయితే ఏ ఆహారాన్ని ఎంత మొత్తంలో తినాలి అనేది మీ బరువు, ఆరోగ్యం, జీర్ణక్రియ వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది.



## చిన్నతనంలో కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే..



చక్కెర ఎక్కువగా ఉన్న పానీయాలు, ఫ్రూట్ జ్యూస్‌లను చిన్నతనంలో అధికంగా తాగిన వారిలో పెద్దయ్యాక రక్తపోటు రిస్క్ ఎక్కువయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. యూఎస్‌లో దాదాపు 25 వేల మందిపై పాతికేళ్ల పాటు అధ్యయనం చేసిన అనంతరం ఈ అంచనాకు వచ్చారు. ఈ అధ్యయనం తాలూకు వివరాలు తాజాగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన సర్క్యులేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హైబీపీ ఉన్న వారికి స్ట్రోక్, గుండె జబ్బుల ముప్పు ఎక్కువన్న విషయం తెలిసిందే. పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం, చిన్నతనంలో రోజుకు రెండు మూడు గ్లాసులకంటే (గ్లాసుకు 333 మిల్లీలీటర్ల డ్రింక్) ఎక్కువగా షుగరీ డ్రింక్స్ తాగే వారిలో హైబీపీ ముప్పు వారానికి మూడు గ్లాసులు తాగేవారితో పోలిస్తే 52 శాతం అధికంగా ఉన్నట్టు తేలింది. ముఖ్యంగా సోడాతో హైబీపీ ముప్పు 23 శాతం పెరిగితే, స్పోర్ట్స్ డ్రింక్స్‌తో ఈ ముప్పు 36 శాతం మేర పెరిగిందని చెప్పారు.

## ఎనర్జీ డ్రింక్స్‌ను రోజూ తాగుతున్నారా..

ఎనర్జీ డ్రింక్స్ గత రెండు దశాబ్దాలుగా యువతలో విపరీతమైన ఆదరణ పొందాయి. ఇవి కేవలం పానీయాలుగా కాకుండా ఉత్సాహం, వేగం, సాహసానికి ప్రతీకగా ప్రచారం చేయబడటంతో విద్యార్థులు, యువ ఉద్యోగుల్లో వీటి వినియోగం పెరిగింది. పరీక్షల కోసం రాత్రిళ్లు మేల్కొని చదివే విద్యార్థులు, ఎక్కువసేపు పని చేసే ఉద్యోగులు తక్షణ శక్తి కోసం వీటిని ఆశ్రయించడం సాధారణమైంది. అయితే తరచూ ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం ఆరోగ్యంపై, ముఖ్యంగా మూత్రపిండాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అప్పుడప్పుడు ఒకటి లేదా రెండు ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం సాధారణంగా పెద్ద సమస్య కాదని నిపుణులు చెబుతున్నారు. కానీ వాటిని రోజువారీ అలవాటుగా మార్చుకోవడం వల్ల ఆరోగ్యపరమైన ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఎనర్జీ డ్రింక్స్ తాగిన తర్వాత కలిగే ఉత్సాహానికి ప్రధాన కారణం వాటిలో ఉండే అధిక మోతాదు కెఫిన్, ఇతర ఉత్తేజక పదార్థాలు. టౌరిన్, గ్వారానా వంటి పదార్థాలు కూడా వీటిలో సాధారణంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని తాత్కాలికంగా చురుకుగా మార్చినా, అధిక మోతాదులో తీసుకుంటే రక్తపోటును పెంచి మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయి. దీర్ఘకాలంగా అధిక పరిమాణంలో ఎనర్జీ డ్రింక్స్ తీసుకునేవారిలో మూత్రపిండాల వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మధుమేహం లేదా రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు ఇప్పటికే ఉన్నవారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే మరో ప్రధాన సమస్య డీహైడ్రేషన్. వీటిలోని ఉత్తేజక పదార్థాలు శరీరంలో నీటి సమతుల్యతను ప్రభావితం చేయడంతోపాటు మూత్రపిండాలకు వెళ్లే రక్తప్రసరణను తగ్గించే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితులు కలిసి మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తాయి. చాలా ఎనర్జీ డ్రింక్స్‌లో చక్కెర కూడా అధిక మోతాదులో ఉంటుంది. ఒకే క్యాన్‌లో 40 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర ఉండే సందర్భాలు కూడా ఉన్నాయి. అధిక చక్కెర తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరిగి తర్వాత వేగంగా పడిపోవడం జరుగుతుంది. ఇది శరీరానికి అదనపు ఒత్తిడిని కలిగించడంతో పాటు డీహైడ్రేషన్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అధిక చక్కెర వినియోగం యూరిక్ యాసిడ్ స్థాయిలను కూడా పెంచే అవకాశం ఉంటుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి అనుకూలం కాదు. ఆరోగ్యంగా ఉన్న యువకులు కూడా తక్కువ సమయంలో అధిక పరిమాణంలో ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం వల్ల అకస్మాత్తుగా మూత్రపిండాల గాయం (అక్యూట్ కిడ్నీ ఇంజరీ) బారిన పడిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఎనర్జీ డ్రింక్స్ తక్షణ శక్తిని అందిస్తున్నట్లు అనిపించినప్పటికీ, వాటి ప్రభావం తాత్కాలికమే. అధిక వినియోగం వల్ల గుండె వేగం పెరగడం, రక్తపోటు అధికమవడం, నిద్ర సమస్యలు, ఆందోళన వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. ఆరోగ్య నిపుణుల సూచన ప్రకారం శక్తి కోసం ఎనర్జీ డ్రింక్స్‌పై ఆధారపడటానికి బదులుగా సరిపడా నిద్ర, సమతుల ఆహారం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం మంచిది. ఆకర్షణీయమైన ప్రకటనలకు ప్రభావితమై ఎనర్జీ డ్రింక్స్‌ను రోజువారీ జీవితంలో భాగంగా మార్చుకోవడం కంటే, పరిమితంగా మాత్రమే తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.




## ముఖాన్ని మెరిపించాలంటే..!

చర్మాన్ని మెరిపించడానికి ఫేస్‌ప్యాక్‌లు మొదలైనవి వేసుకోవడం మనకు అలవాటే! అయితే ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను ఉపయోగించి వీటిని తయారు చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.

కీరాదోస

కీరాదోస గుజ్జు తీసుకుని అందులో గుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

అరకప్పు

అరకప్పు పైనాపిల్ ముక్కలు, పావు కప్పు బొప్పాయి ముక్కలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. తర్వాత అందులో అరచెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరని



వ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ఓసారి, చల్లని నీటితో మరోసారి ముఖాన్ని శుభ్రం చేసుకుని పొడి వస్త్రంతో తుడుచుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. మిశ్రమం కాస్త చల్లబడిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత మీ చర్మానికి నప్పే క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. కోడిగుడ్డులోని తెల్లసొనను బాగా గిలక్కొట్టి, అందులో మెత్తగా చేసుకున్న అరచెంచా అవకాడో గుజ్జు, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. 20 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇది చర్మంలోని తేమను అధిక సమయం నిలిపి ఉంచేందుకు తోడ్పడుతుందని చెబుతున్నారు నిపుణులు. ముఖానికి ఇవి అప్లై చేసుకున్నాక ఎండలోకి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ తప్పనిసరిగా రాసుకోవాలి. లేదంటే ట్యాన్ ఏర్పడే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. అలాగే వీటిని ప్రయత్నించే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## జబ్బుల కాలం.. జర పైలం

పిల్లల ఆటాపాటలు.. కిలకిల నవ్వులు.. సరదా సందడిగా ఉంటేనే ఇంటిల్లిపాది సంతోషంగా ఉండేది. ఒక వేళ అనారోగ్యం తలెత్తితే భిన్న పరిస్థితులు చూడాల్సి ఉంటుంది. స్కూల్ ఓపెన్ .. వర్షాకాల సీజన్ కావడం తో వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. పోషకాహారం, సరైన నిద్ర తప్పనిసరి అని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలంలో కలుషితమైన ఆహారం, నీటి వల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇంటి నుంచి తీసుకెళ్లిన శుభ్రమైన తాగునీరే ఉపయోగించాలి. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. డెంగ్యూ పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పిల్లలు పూర్తి చేతుల దుస్తులు ధరించేలా చూడాలి. తడి వాతావరణానికి ఆకస్మాత్తుగా అస్వస్థత చెందుతుంటారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం నెలకొన్న వాతావరణంతో ఫ్లూ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో ఎక్కువగా దగ్గు, జలుబుకు సంబంధించినవే ఉంటున్నాయి. జ్వరం, తీవ్రమైన ఒళ్లునొప్పులు, తలనొప్పి అసాధారణ అలసట వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అలర్జీలు లేదా ఆస్తమా ఉన్న పిల్లలకు వర్షాకాలంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. తరచూ దగ్గు, తుమ్ములు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు.



## దేశీయ విపణిలోకి ఎలీ లిల్లీ క్యాన్సర్ ఔషధం

క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే ట్రాన్స్‌ట్రైవ్ ఔషధాన్ని భారత్‌లో విడుదల చేసినట్లు అమెరికా సంస్థ ఎలీ లిల్లీ ప్రకటించింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీఓ) నుంచి మార్కెటింగ్ అనుమతులు లభించడంతో, ట్రాన్స్‌ట్రైవ్‌ను 40 ఎమ్‌జీ, 80 ఎమ్‌జీ, 120 ఎమ్‌జీ, 160 ఎమ్‌జీ మోతాదుల్లో విడుదల చేసినట్లు తెలిపింది. వైద్యుల సిఫారసు మేరకు ఈ ఔషధాన్ని నోటి ద్వారా రోజుకు రెండు సార్లు తీసుకోవాల్సి ఉంటుంది. రోజుకు రెండు మాత్రల చొప్పున, 14 రోజులకు ఈ బాక్స్ సరిపోతుంది. కణాల పెరుగుదలను నియంత్రించే జన్యువులో వచ్చే మార్పులను లక్ష్యంగా చేసుకోవడానికి, ట్యూమర్ పెరగడానికి కారణమయ్యే అసాధారణ సంకేత మార్గాలను అడ్డుకోవడానికి ఈ ఔషధాన్ని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది.




# ఆసియా మార్కెట్ల భారీ పతనం..

ఆసియా స్టాక్ మార్కెట్లు నేడు భారీగా కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా బెంచ్ మార్కెట్ ఇండెక్స్ కోస్పీ ఏకంగా 8 శాతం మేర పతనం కాగా.. జపాన్‌కు చెందిన నిక్కీ 5 శాతం మేర క్షీణించింది. టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఈ పతనానికి కారణమయ్యాయి. నేడు మన మార్కెట్‌లకు సెలవు కావడం గమనార్హం. గిఫ్ట్ నిఫ్టీ మాత్రం శుక్రవారం ఉదయం 100 పాయింట్ల మేర క్షీణించింది. కోస్పీ దాదాపు 8.2 శాతం మేర పతనమైంది. దీంతో ట్రేడింగ్‌ను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. అటు జపాన్ నిక్కీ సైతం 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, చైనా బ్లూచిప్ సీఎస్ఐ300 ఇండెక్స్ 2.9 శాతం, షాంఘై కాంపోజిట్ సైతం 2 శాతం మేర క్షీణించాయి. జూన్ 23న కూడా ఇదే తరహాలో ఆసియా మార్కెట్‌లో అమ్మకాలు



కనిపించాయి. నేడు మళ్లీ అదే స్థాయిలో మార్కెట్లు పడిపోయాయి. మెమొరీ, స్టోరేజీ చిప్‌ల ధరల కారణంగా యాపిల్ తన ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరలను భారీగా పెంచిన సంగతి తెలిసిందే. దీంతో ఏఐ మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న ఖర్చు, పెరుగుతున్న సెమీ కండక్టర్ల ధరలు బిగ్ టెక్ కంపెనీలనూ వదలడం లేదన్న సంకేతాలను పంపింది. దీంతో యాపిల్ షేరు విలువ నిన్న ఒక్కరోజే 6.1 శాతం మేర క్షీణించింది. 25 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ షేర్లు కూడా పతనమయ్యాయి. ఈ ఉదంతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల కోసం భారీగా అప్పులు చేసి పెడుతున్న పెట్టుబడులు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగుతాయా లేదా అనే అనుమానాలను ఇన్వెస్టర్లలో నెలకొల్పింది. ఏఐ పెట్టుబడులపై ఆలోచనలో పడేసింది. ఈ క్రమంలోనే చైనాకు చెందిన సీఎస్ఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండెక్స్ 5 శాతం, సీఎస్ఐ 5జీ కమ్యూనికేషన్ ఇండెక్స్ 6.3 శాతం, హాంగ్ సెంగ్ టెక్ ఇండెక్స్ 3.3 శాతం చొప్పున క్షీణించాయి.

# పెయిడ్ సర్వీస్‌గా వాట్సప్ ప్లస్

వాట్సప్ వినియోగదారుల కోసం మెటా సంస్థ 'వాట్సప్ ప్లస్' పేరిట పెయిడ్ సర్వీసెస్‌ను అందుబాటులోకి తెచ్చింది. నెలకు రూ.79తో ఈ సేవలు పొందొచ్చు. మొదటి నెల రోజులు ఉచితంగా ట్రై చేయొచ్చు కూడా. 'వాట్సప్ ప్లస్' కోసం ఇప్పటికే ఉన్న యాప్ సెటింగ్స్‌లోకి వెళ్లి సబ్‌స్క్రిప్షన్స్ విభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ 'వాట్సప్ ప్లస్' కనిపిస్తుంది. అప్‌గ్రేడ్ యువర్ మెసేజింగ్ ఎక్స్‌పీరియన్స్‌పై క్లిక్ చేస్తే తొలుత నెల రోజుల పాటు ఫ్రీ ట్రయల్.. ఆ తర్వాత పెయిడ్ సర్వీసెస్ పొందొచ్చు. ప్రస్తుతం వాట్సప్‌లో 3 చాట్‌ల వరకే పిన్ చేసుకునే అవకాశముంది. వాట్సప్ ప్లస్‌లో 20 చాట్‌ల వరకూ పిన్ చేసుకోవచ్చు. వేల మెసేజ్‌లు వచ్చినా సరే.. మనకు కావాల్సిన ముఖ్యమైన 20 చాట్స్ స్క్రీన్‌పై టాప్‌లో కనిపిస్తాయి. హోమ్ స్క్రీన్‌పై ఉండే వాట్సప్ లోగో గ్రీన్ కలర్‌కు బదులుగా నచ్చిన రంగులోకి మార్చుకోవచ్చు. చాట్ లోపల ఉండే టెక్స్ట్ బబుల్స్, మెసేజ్ టిక్స్, బ్యాక్‌గ్రౌండ్ వాల్‌పేపర్స్ అన్నీ మనం ఎంపిక చేసుకునే థీమ్ రంగులోకి మారిపోతాయి. రాయల్ పర్పుల్, వెల్వెట్ రెడ్, సైబర్ పంక్ బ్లూ లాంటి ప్రీమియం కలర్స్ దీనిలో అందుబాటులో



ఉంటాయి. చాట్ లిస్ట్‌ను అప్‌గ్రేడ్, కస్టమ్ లిస్ట్ క్రియేట్ చేసుకోవడం, కావాల్సిన థీమ్, రింగ్‌టోన్, నోటిఫికేషన్ టోన్ సెట్ చేసుకోవచ్చు. యానిమేషన్‌తో కూడిన ప్రత్యేక స్టిక్కర్లు పంపించొచ్చు. ప్రత్యేక రింగ్‌టోన్‌లు పొందొచ్చు. సేవలు వద్దనుకునేవారు.. ఎప్పుడైనా సబ్‌స్క్రిప్షన్ రద్దు చేసుకోవచ్చు.

# 3 చైనా ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ విచారణ




దేశీయ సంస్థలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్' (డీజీటీఆర్)కు 4 దరఖాస్తులు అందించాయి. పాలిమర్ పరిశ్రమలో ఉపయోగించే కొన్ని యాంటీఆక్సిడెంట్లు చైనా, కొరియా, సింగపూర్ నుంచి దిగుమతి అవుతుండటంపై విచారణ జరపాలని వినతి ఆర్గానిక్స్ కోరింది. ప్యాకేజింగ్ పరిశ్రమలో ఉపయోగించే బయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలిమైడ్ (బీఓపీఏ) ఫిల్మ్ దిగుమతులు చైనా, థాయిలాండ్ నుంచి భారీగా వస్తుండటంపై విచారణ జరపాలని జేపీఎఫ్ఎల్ ఫిల్మ్స్ కోరింది. అమెరికా, చైనా, దక్షిణ కొరియా నుంచి వస్తున్న థర్మల్ పేపర్ లేదా థర్మల్ సెన్సిటివ్ పేపర్ దిగుమతులపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ థర్మల్ పేపర్ మానుఫ్యాక్చరర్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ఫిర్యాదు చేసింది. డెకార్ పేపర్‌పై విధించిన యాంటీ-డంపింగ్ సుంకాన్ని సన్‌సెట్ రివ్యూ చేయాలని ఐటీసీ లిమిటెడ్ కోరింది.

దేశీయ తయారీదార్ల ఫిర్యాదుల నేపథ్యంలో, చైనా నుంచి దిగుమతి అయ్యే మూడు ఉత్పత్తుల (థర్మల్ పేపర్, బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీఅమైడ్ (బీఓపీఏ) ఫిల్మ్, కొన్ని యాంటీయాక్సిడెంట్ల)పై యాంటీ-డంపింగ్ విచారణ ప్రారంభించినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దర్యాప్తులో కొరియా, సింగపూర్, అమెరికా, థాయిలాండ్ దేశాలు కూడా ఉన్నాయి. దేశీయ తయారీ రంగానికి ఇబ్బంది కలిగిస్తున్న ఈ చౌక ఉత్పత్తుల దిగుమతులపై

# ఏఐ సాంకేతికతలపై భారత్‌కు అమెరికా హామీ


కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతలను వినియోగించుకునేందుకు ఒకసారి అనుమతి ఇచ్చాక, వాటిని ఉపసంహరించబోమని భారత్‌కు అమెరికా హామీనిచ్చింది. ఏఐ సహకారం, విశ్వసనీయ సాంకేతికత సరఫరా వ్యవస్థలపై అమెరికా అధికారులతో జరిగిన చర్చల్లో హామీ లభించినట్లు భారత ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ పేర్కొన్నారు. ఏఐ రంగంలో మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవశ్యకత ఇంకా ఉందని,




నియంత్రణలకు ఇది సరైన సమయం కాదని భారత్ పునరుద్ఘాటించింది. అవసరమైతే భవిష్యత్తులో నిబంధనలు పెట్టుకోవచ్చని అభిప్రాయపడింది. పాక్స్ సిలికా కార్యక్రమం కింద ఇరు దేశాలు సెమీకండక్టర్ తయారీ, ఏఐని, కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను అందిపుచ్చుకోవడంపై చర్చలు జరిపారు. ఒకే దేశం/వనరులపై విపరీతంగా ఆధారపడడాన్ని తగ్గించడం కోసం అమెరికా తీసుకొచ్చిన వ్యూహాత్మక భాగస్వామ్య, ఆర్థిక భద్రత నియమావళే పాక్స్ సిలికా అన్న సంగతి తెలిసిందే.

# 'సెక్షన్ 301' దర్యాప్తు పూర్తయితే.. పాత స్థాయిలో అమెరికా టారిఫ్‌లు

సుంకాలపై (US Tariffs) అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ (Scott Bessent) కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం (USTR) సెక్షన్ 301పై చేస్తున్న దర్యాప్తు పూర్తయితే.. తిరిగి పాత స్థాయిలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సెక్షన్ 122 కింద విధించిన 10 శాతం టారిఫ్‌లు జులై 24 వరకు ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉండనున్నాయి. వెట్టిచాకిరి నిర్మూలనలో విఫలమైనందుకు గానూ భారత్ సహా 50కి పైగా దేశాల దిగుమతులపై అదనంగా 12.5 శాతం సుంకం విధించాలని అమెరికా వాణిజ్య కార్యాలయం తన మధ్యంతర నివేదికలో ప్రతిపాదించింది. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై పరస్పర సుంకాలు ఉపయోగించారని స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. సెక్షన్ 301 ప్రక్రియ కూడా అదే విధమైన లక్ష్యాన్ని సాధించడానికి చేపట్టినట్లు తెలిపారు. భారత్ - అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరో వైపు లండన్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఇతర దేశాలపై ప్రయోజనాలను పొందినప్పుడే భారత్ ఒప్పందం విషయంలో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వా




ములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు (Trade Policies).. అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.





## పాలమూరు బోణీ



పాలమూరు స్ట్రైకర్స్ బోణీ కొట్టింది. గురువారం రాత్రి ఆ జట్టు మెదక్ ఫాల్కన్స్‌పై 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ రాయుడు (54 నాటౌట్; 42 బంతుల్లో 3×4, 2×6), విఘ్నేశ్ రెడ్డి (39; 22 బంతుల్లో 2×4, 3×6), ప్రతీక్ (27 నాటౌట్; 10 బంతుల్లో 4×4, 1×6) మెరుపులతో పాలమూరు 165 పరుగుల లక్ష్యాన్ని 17.5 ఓవర్లలో ఛేదించింది. రతన్ తేజ (23) రాణించాడు. సాయివరుణ్ రెండు వికెట్లు పడగొట్టగా.. రవితేజ, సయ్యద్ ఘాజి, శ్రుంజిత్ తలో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ ఫాల్కన్స్ 9 వికెట్లకు 164 పరుగులు చేసింది. విక్రమ్ నాయక్ (36; 33 బంతుల్లో 3×4, 1×6), సాయి వరుణ్ (36; 23 బంతుల్లో 4×6), నమన్ అగర్వాల్ (21) రాణించారు. రవికిరణ్, రిషబ్ చెరో రెండు వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేశారు. మూడు మ్యాచ్‌ల్లో పాలమూరుకు ఇదే తొలి విజయం.

# 4 సార్లు ఛాంపియన్ జర్మనీకి ఈక్వెడార్ చెక్..



ఫిఫా ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. నాలుగు సార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన జర్మనీకి దక్షిణ అమెరికా దేశం ఈక్వెడార్ షాక్ ఇచ్చింది. గ్రూప్-ఇలో భాగంగా అత్యంత హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బలమైన జర్మనీపై 2-1 తేడాతో నెగ్గి నాకౌట్ దశకు అర్హత సాధించింది. దీంతో ఫిఫా చరిత్రలో ఆ దేశం రెండో సారి నాకౌట్ దశకు దూసుకెళ్లింది. పోరాడితేనే విజయన్నట్లు ఆ జట్టు ఆటగాళ్లు చెలరేగిపోయారు. ఎట్టకేలకు విజయం సాధించడంతో ఆ దేశ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మ్యాచ్ ముగింపుగా రిఫరీ విజిల్ వేయడమే ఆలస్యం.. ఆనంద బాష్పాలు రాల్చారు. కేరింతలతో హోరెత్తించారు. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో రెండో నిమిషానికే జర్మనీ ఆటగాడు లెరోయ్ గోల్ కొట్టడంతో ఒక్కసారిగా ఈక్వెడార్ ఆటగాళ్లు, అభిమానులు నిశ్చేష్టులయ్యారు. అయితే జర్మనీకి ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ప్రత్యర్థి గోల్ నుంచి తేరుకున్న ఈక్వెడార్.. తొమ్మిదో నిమిషానికి స్కోర్‌ను సమం చేసింది. ఆ జట్టు ప్లేయర్ నిల్సన్ గోల్ కొట్టడంతో స్టేడియం ఊగిపోయింది. అనంతరం తొలి అర్ధభాగంలో మరో గోల్ కోసం ఇరుజట్లు హోరాహోరీగా తలపడ్డప్పటికీ ఫలితం దక్కలేదు. ఇక రెండో అర్ధభాగంలో ఈక్వెడార్ ఆటగాడు ప్లేటా (77వ నిమిషం) మ్యాజిక్ చేశాడు. కార్నర్ కిక్‌ను ఉపయోగించుకుని అద్భుతంగా గోల్ చేయడంతో 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనంతరం పలుమార్లు జర్మనీ గోల్‌పోస్ట్ లక్ష్యంగా ఈక్వెడార్ ఆటగాళ్లు దూసుకెళ్లారు. చాలావరకు బంతి తమ ఆధీనంలోనే ఉన్నప్పటికీ జర్మనీ ఆటగాళ్లు ప్రభావం చూపలేకపోయారు. ఇక ఈక్వెడార్ ఆటగాళ్లు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ప్రత్యర్థిని అడ్డుకున్నారు. ఈ మ్యాచ్‌లో రిఫరీ నలుగురు ఆటగాళ్లకు యెల్లో కార్డులు ఇచ్చాడు. వారిలో ముగ్గురు ఈక్వెడార్ ప్లేయర్లే కావడం గమనార్హం. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో కురసావ్‌పై ఐవరీకోస్ట్ 2-0 తేడాతో గెలిచింది. దీంతో ఐవరీకోస్ట్ సైతం నాకౌట్‌కు దూసుకెళ్లింది. ఈ రెండు మ్యాచ్‌లతో గ్రూప్-ఇ లీగ్ దశ పూర్తయింది. మొత్తం మూడు మ్యాచ్‌ల్లో తలో రెండు విజయాలతో జర్మనీ, ఐవరీకోస్ట్ నేరుగా నాకౌట్‌కు అర్హత సాధించగా, 4 పాయింట్లు సాధించిన ఈక్వెడార్ మూడో జట్టుగా నాకౌట్ దశకు చేరుకుంది. ఫిఫా కొత్త నిబంధనల ప్రకారం.. మొత్తం 12 గ్రూప్‌ల్లోని 48 జట్లలో మొదటి రెండు స్థానాల్లో నిలిచినవి నాకౌట్ దశకు వెళతాయి. ప్రతి గ్రూప్‌లోని మూడో స్థానంలో ఉన్న 12 జట్లలో పాయింట్ల ఆధారంగా 8 ఉత్తమ జట్లు సైతం నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి.

# వైభవ్ సూర్యవంశీ మేనియా.. క్షణాల్లోనే టికెట్లు ఫుల్!

క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఎక్కడ చూసినా వైభవ్ సూర్యవంశీ పేరే వినబడుతోంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంపికై చరిత్ర సృష్టించాడు. ఇక అరంగేట్రం చేస్తే అది కూడా రికార్డే. ప్రస్తుతం భారత జట్టు ఐర్లాండ్‌లో ఉంది. రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఇవాళ సాయంత్రం జరగనుంది. వైభవ్ సూర్యవంశీ డెబ్యూపై ఇంకా స్పష్టత రాలేదు. కానీ, అతడి మేనియా ఎలా ఉందంటే.. బెల్‌ఫాస్ట్ మైదానంలో జరగనున్న మ్యాచ్ టికెట్లన్నీ క్షణాల్లోనే అమ్ముడైపోవడం విశేషం. ఇదే విషయాన్ని ఐర్లాండ్ క్రికెట్ కమిటీ ఛైర్మన్ బ్రియాన్ మాక్‌నీస్ తెలిపారు. "టికెట్ల అమ్మకం పెట్టినప్పటి నుంచి నా ఫోన్ మోగుతూనే ఉంది. మరిన్ని టికెట్లు కావాలంటూ విజ్ఞప్తులు ఎక్కువగా వచ్చాయి. బెల్‌ఫాస్ట్‌లో మేం కేవలం ఐదారు వేలమందికి మాత్రమే ఆతిథ్యం ఇవ్వగలం. కానీ, మూడింతల డిమాండ్ వచ్చింది. క్షణాల్లోనే టికెట్లు సేల్ అయిపోయాయి. ఇంకా కావాలని డిమాండ్లు వస్తున్నాయి. ప్రతి ఒక్కరూ వైభవ్ సూర్యవంశీ గురించే మాట్లాడుతున్నారు. అతడు అదనపు ఆకర్షణ తీసుకొస్తాడనడంలో సందేహం లేదు. అతడు తొలి టీ20లో అరంగేట్రం చేస్తే.. ప్రత్యక్షంగా చూడాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు" అని మాక్‌నీస్ వెల్లడించారు.




మరోవైపు బెల్‌ఫాస్ట్ మైదానాన్ని ఎంపిక చేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. తక్కువ సీటింగ్ కెపాసిటీ ఉన్న ఇక్కడ మ్యాచ్ నిర్వహించడం సరైంది కాదని పలువురి అభిప్రాయం. డబ్లిన్‌లో పెద్ద స్టేడియం ఉండగా.. బెల్‌ఫాస్ట్‌లో నిర్వహించడం సబబు కాదని వారి వాదన.

# చర్చలో ఉన్న పేర్లు ఇవే..

ఐపీఎల్ - 2027 మినీ వేలానికి ఇంకా చాలా సమయం ఉంది. సుమారుగా డిసెంబరు నెలలో జరగొచ్చు. అయితే అనూహ్యంగా ఇప్పుడే ట్రేడింగ్ మొదలైంది.

రిషభ్ పంత్, కుల్‌దీప్ యాదవ్ ఇప్పటికే ట్రేడింగ్ ద్వారా జట్లు మారారు. మరికొంతమంది గురించి చర్చలు జరుగుతున్నాయి. క్రీడా వర్గాల సమాచారం ప్రకారం ఎవరా ఆటగాళ్లు, ఏ జట్టుకు వెళ్లొచ్చో చూద్దాం.. ముంబయి ఇండియన్స్‌కి హార్దిక్ దూరమవుతున్నాడని టాక్. అతడి కోసం కోల్‌కతా ప్రయత్నిస్తోంది. ఖలీల్ అహ్మద్‌ను వదులుకునేందుకు చెన్నై సిద్ధమవుతుండగా.. అతని కోసం ముంబయి ప్రయత్నాలు చేస్తోందని టాక్. హార్దిక్ కోల్‌కతాకు వస్తే.. అతని బదులు కామెరూన్ గ్రీన్‌ను ముంబయికి ట్రేడ్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫినిషర్ అశుతోష్ శర్మను చెన్నైకి ట్రేడ్ చేయాలని దిల్లీ చూస్తోంది. అతనికి బదులు ఓ స్పిన్నర్‌తోపాటు గుర్జప్‌నీత్ సింగ్ దిల్లీ వెళ్లే అవకాశముంది. ఫినిషర్ అశుతోష్ జట్టులోకి వస్తే.. చాలా ఏళ్లుగా ఉన్న ఫినిషర్ శివమ్ దూబెను ట్రేడ్ ద్వారా తీసుకోవాలని ముంబయి చూస్తోంది. (పాండ్య స్థానంలో) అజింక్య రహానెకు థాంక్యూ చెప్పే ఉద్దేశంలో ఉన్న కోల్‌కతా అతని స్థానంలో ముంబయి నుంచి సూర్యను తీసుకోవాలని చూస్తోంది. సూర్య కోసం ఇటు కోల్‌కతా, అటు రాజస్థాన్ పోటీ పడుతున్నాయట. రెండు జట్లకు సీనియర్ కెప్టెన్ అవసరం ఎంతైనా ఉంది. ముంబయి నుంచి సూర్య రాజస్థాన్‌కి వస్తే.. అతని బదులు యశస్వి జైస్వాల్‌ను ట్రేడ్ చేద్దాం అనుకుంటున్నారట. ప్రశాంత్ వీర్‌ని తీసుకొని సరిగ్గా అవకాశాలు ఇవ్వని చెన్నై.. లఖ్‌నవూకి ట్రేడ్ చేయాలని చూస్తోందని సమాచారం. రిటైన్ సమయంలో ఇషాన్ కిషన్‌ను వదులుకున్న ముంబయి.. ఇప్పుడు అతని కోసం హైదరాబాద్‌తో సంప్రదింపులు చేస్తోందట.

# పంత్ వస్తాడని తెలుసు..

ఐపీఎల్‌లోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఘనత సాధించిన రిషభ్ పంత్ మళ్లీ తన పాత జట్టుకు వచ్చేశాడు. గత మెగా వేలంలో రూ. 27 కోట్లతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తీసుకుని కెప్టెన్సీ అప్పగించింది. కానీ, అతడు తన స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయాడు. దీంతో అతడిని దిల్లీకి ట్రేడ్ చేస్తూ లఖ్‌నవూ నిర్ణయం తీసుకుంది. కొత్త డీల్‌లో భాగంగా జీతంలో భారీకోతకు అంగీకరించాడు. ఇప్పుడు దిల్లీ పంత్‌కు రూ.15 కోట్లు చెల్లించనుంది. ఈ క్రమంలో రిషభ్ పంత్ ట్రేడ్‌పై విశ్లేషించిన మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ దిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్ మార్పుపైనా స్పందించాడు. "లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో రిషభ్ పంత్ గడిపిన సీజన్లు.. ఆ తర్వాత అతడు ఇచ్చిన కొన్ని ఇంటర్వ్యూలను చూస్తే ఇప్పుడీ ట్రేడ్ ఆశ్చర్యం కలిగించలేదు. ఎల్ఎస్‌జీపై తీవ్ర అసహనంతో ఉన్నాడని అప్పుడే సంకేతాలు కనిపించాయి. అక్కడి యాజమాన్యం, కోచింగ్ సిబ్బంది వల్ల కూడా ఇది అయి ఉండొచ్చు. ఇప్పుడు మళ్లీ దిల్లీ క్యాపిటల్స్‌కు వచ్చేశాడు" అని ఏబీడీ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో ఒక జట్టు అత్యంత విజయవంతమైందంటే దానికి కారణం కేవలం ప్లేయర్లు మాత్రమే కాదు. మేనేజ్‌మెంట్ సహకారం, కోచింగ్ సిబ్బంది పాత్ర కూడా కీలకమే. కానీ, దిల్లీ



క్యాపిటల్స్‌లో అదే సమస్యగా మారిందేమో అనిపించింది. ఇప్పుడు మళ్లీ సౌరభ్ గంగూలీ డైరెక్టర్‌గా వచ్చారు. యువరాజ్ సింగ్ బ్యాటింగ్ కోచ్. ఇక రిషభ్ పంత్ కూడా జట్టులోకి వచ్చేశాడు. మరి ఇవి జట్టు ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో చూడాలి. అయితే యాజమాన్యంలో మార్పు, కోచింగ్ సిబ్బంది వస్తూ పోతూ ఉండటం కచ్చితంగా గందరగోళం సృష్టిస్తుంది. ఈ మార్పులను సానుకూల దృక్పథంతో తీసుకొని పరిస్థితులకు అలవాటు పడటం ఆటగాళ్లకు కష్టంగా మారే అవకాశం లేకపోలేదు" అని ఏబీడీ విశ్లేషించాడు. గత రెండేళ్లు జీఎంఆర్ నిర్ణయాలు తీసుకోగా.. ఇప్పుడు జేఎస్‌డబ్ల్యూ ఆ స్థానంలోకి వచ్చింది. ఈ రెండు సంస్థలు ఉమ్మడిగానే దిల్లీ క్యాపిటల్స్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.


# వుదయం సినిమా MOVIE TIME!

## మిస్టరీ, ఇన్వస్టిగేషన్ థ్రిల్లర్ 'తత్వం' ట్రైలర్ విడుదల




**వుదయం సినిమా** కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది.

## ఓజీ యూనివర్స్ షురూ.. 70 శాతం స్క్రిప్ట్ పూర్తి!




**వుదయం సినిమా :** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు మరో క్రేజీ అప్‌డేట్! బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఓజీ'కి సంబంధించిన ఓ ఆసక్తికర వార్త ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ చిత్రానికి 'ప్రీక్వెల్' (కథకు ముందు జరిగే గతం) రాబోతుండగా, అందుకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 70 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. ఇటీవల పవన్ కల్యాణ్ స్వయంగా 'ఓజీ' యూనివర్స్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి పవన్, సుజీత్ మధ్య జరిగిన చర్చల వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. 'ఓజీ' పార్ట్ 1 కంటే ముందే, 'ఓజస్ గంభీర' పాత్ర అసలు నేపథ్యం ఏంటి? ముంబై మాఫియా సామ్రాజ్యంలోకి అతడు ఎలా అడుగుపెట్టాడు? అనే గతాన్ని ఈ ప్రీక్వెల్‌లో అత్యంత పవర్‌ఫుల్‌గా చూపించనున్నట్లు సమాచారం. ఈ ప్రకటనతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది.

## 'వారణాసి' అప్‌డేట్ ఇచ్చిన జక్కన్న



**వుదయం సినిమా :** సూపర్ స్టార్ మహేశ్ బాబు, దార్శనిక దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' గురించి జక్కన్న అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ విజువల్ వండర్ షూటింగ్ మరో నాలుగు నెలల్లో పూర్తి కానుందని వెల్లడించి అభిమానుల్లో జోష్ నింపారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'అన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న రాజమౌళి.. ఓ అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ సినిమా ప్రగతిని పంచుకున్నారు. ''వారణాసి నేపథ్యంలో సాగే కీలక షెడ్యూల్స్‌తో పాటు, హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ అంతా పూర్తయింది. ప్రస్తుతం కథను ముందుకు నడిపించే టాకీ పార్ట్ (చిన్న చిన్న సన్నివేశాల) షూట్ జరుగుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా గుమ్మడికాయ కొట్టేస్తాం (షూటింగ్ మొత్తం పూర్తవుతుంది)'' అని జక్కన్న స్పష్టం చేశారు. అలాగే ఈ సినిమాను భారీ ఐమాక్స్ ఫార్మాట్‌లో తెరకెక్కించడంపై స్పందిస్తూ.. ఈ తరహా కథలకు ఐమాక్స్ స్క్రీన్లు అద్భుతమైన అనుభూతిని ఇస్తాయని, అయితే ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి మార్పులు చేయలేదని చెప్పారు. సినిమా స్కోప్, ఐమాక్స్ రెండింటికీ సరిపోయేలా 'అనమోర్ఫిక్ ఫ్రేమింగ్' సాంకేతికతను వాడామని, ప్రారంభంలో కొద్దిగా సర్దుబాట్లు చేయాల్సి వచ్చినా ఆ తర్వాత పని సులువైందని వివరించారు. కాగా, ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్‌లో మహేశ్ సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే కీలక పాత్రలో కనిపిస్తున్నారు.

## నాగసాధు తాండవం 'వీరనాగ' సాంగ్ రిలీజ్



**వుదయం సినిమా :** 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో భారీ అంచనాలను పెంచింది. దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో విరాట్ కర్ణ హీరోగా నటించారు. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నాగార్కర్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ సాంగ్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ వీరనాగ సాంగ్ ని రిలీజ్ చేశారు. 'వీరనాగ' పాట నాగ సాధువుల ఆధ్యాత్మిక తాండవాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. శ్రీహర్ష ఈమని సాహిత్యం ఆధ్యాత్మిక భావాన్ని బలంగా ప్రతిబింబించగా, దీపక్ బ్లూ తన పవర్ ఫుల్ వోకల్స్ తో పాటకు ప్రాణం పోశారు. జునైద్ కుమార్ – అభే అందించిన సంగీతం ప్రతి ఫ్రేమ్‌లో భక్తి భావాన్ని మరింత ఎలివేట్ చేసింది. కైలాస పర్వతాన్ని తలపించే అద్భుతమైన నేపథ్యంతో తెరకెక్కించిన ఈ పాటలో నాగ సాధు తాండవం విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భారీ కాన్వాస్, ఆధ్యాత్మిక వైభవం, అద్భుతమైన సినిమాటోగ్రఫీ, అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్ కలిసి ప్రతి ఫ్రేమ్‌ను ఓ దివ్య దర్శనంలా మలిచాయి. నాగ సాధుగా గా విరాట్ కర్ణ తాండవం కట్టిపడేసింది. ఆయన లుక్, బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా వున్నాయి. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ పాటలోని హైలైట్స్‌లో ఒకటిగా నిలిచింది. వీర నాగ' పాటతో 'నాగబంధం'పై అంచనాలు మరింత పెరిగాయి. పురాణ గాథలు, ఆధ్యాత్మికత, విజువల్ గ్రాండియర్‌ను మేళవించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినీ అనుభూతిని అందించబోతోందనే నమ్మకాన్ని ఈ పాట మరింత పెంచింది.

### 'రాజా ది రాజా' నుంచి బ్యూటీఫుల్ లవ్ సాంగ్



**వుదయం సినిమా :** యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తున్నారు.

## 'ది ఇండియా స్టోరీ' హార్డ్ హిట్టింగ్ టీజర్ రిలీజ్



చిత్రం ప్రధానాంశంగా తీసుకుంది. రోజూ కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేస్తున్న ఈ సమస్యపై అవగాహన కల్పించడమే ఈ సినిమా లక్ష్యం.జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ & స్టూడియోస్‌తో కలిసి రూపొందుతున్న ఈ చిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. సాగర్ బి. షిండే కథ, నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం 2026 జూలై 24న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. టీజర్‌లో కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే న్యాయం కోసం పోరాడుతూ, పురుగుమందుల ఆధారిత వ్యవసాయం వెనుక దాగి ఉన్న భయంకరమైన నిజాలను వెలికితీసే ప్రయత్నం చేయడం ఆసక్తికరంగా ఉంది. రోజువారీ ఆహారంలోకి చేరుతున్న విషపూరిత రసాయనాలు, ముఖ్యంగా యువత ఆరోగ్యంపై చూపుతున్న తీవ్ర ప్రభావాన్ని టీజర్ ఆవిష్కరించింది. భావోద్వేగాలతో పాటు సామాజిక బాధ్యతను ప్రతిబింబించే కథతో, తరచూ మన దృష్టికి రాని ఒక కీలక సమస్యను ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది.ఈ సందర్భంగా దర్శకుడు చేతన్ డీకే మాట్లాడుతూ, "'ది ఇండియా స్టోరీ' కేవలం సినిమా మాత్రమే కాదు... సమాజంగా మనమందరం చర్చించాల్సిన అంశం.

## "దీవాన" సినిమాకు 1+1 టికెట్ ఆఫర్ అనౌన్స్ చేసిన హీరో శ్రీవిష్ణు



**వుదయం సినిమా :** యంగ్ టాలెంటెడ్ హీరో హర్షిత్ రెడ్డి నటించిన కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయయ్యారు. ఇటీవల గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "దీవాన" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర థ్యాంక్యూ మీట్ ను హీరో శ్రీ విష్ణు ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటి సింధు మాట్లాడుతూ మా పేరెంట్స్ "దీవాన" సినిమా చూసి ఎమోషనల్ అయ్యారు. మా మదర్ కన్నీళ్లు పెట్టుకుంది. మా పేరెంట్స్ లాగానే మిగతా ప్రేక్షకులంతా మా మూవీకి బాగా రిలేట్ అవుతున్నారు. ఈ సినిమాలో పార్ట్ కావడం హ్యాపీగా ఉంది. అన్నారు. నటుడు నర్సింగ్ వాడేకర్ మాట్లాడుతూ మంచి మూవీస్ ఎక్కడున్నా వచ్చి సపోర్ట్ చేసే శ్రీవిష్ణు గారికి థ్యాంక్స్. మాది చిన్న సినిమా కాదు పది పెద్ద సినిమాలను కొట్టే సినిమా. ఈ సినిమాలో ఫ్రెండ్స్ గా నటించిన మేమంతా నిజంగానే మంచి స్నేహితులం అయ్యాం. ఈ సినిమాకు వెళ్లి చూడండి. నచ్చకపోతే నేను మళ్లీ సినిమాల్లో నటించను. అన్నారు. నటుడు టోనీ మాట్లాడుతూ చిన్న సినిమాలను ప్రమోట్ చేయడంలో మెగాస్టార్ శ్రీవిష్ణు అన్న. ఆయన బ్రోచేవారెవరురా సినిమాలో నేను నటించాను. ఆయన ఈ రోజు మా మూవీ థ్యాంక్యూ మీట్ కు రావడం హ్యాపీగా ఉంది. సింగిల్ పేరెంట్ ఫ్యామిలీ మాది. మమ్మల్ని మా అమ్మ ఎంతో కష్టపడి పెంచింది. ఇప్పటికే కష్టపడుతోంది. అమ్మకు త్వరలోనే మా "దీవాన" సినిమా చూపించాలని అనుకుంటున్నా. అన్నారు. నటుడు కెకె మాట్లాడుతూ మా "దీవాన" సినిమా మీ అందరి సపోర్ట్ తో ఒక మైలేజ్ కు వచ్చి పికప్ అందుకుంది. అందుకే ఎలాంటి హార్డ్ ఫీలింగ్స్ లేకుండా హ్యాపీగా థ్యాంక్యూ మీట్ చేస్తున్నాం. ఈ మూవీలో చెప్పినట్లు మీరు జీవితంలో ఏం సాధించినా, ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులను సంతోషంగా ఉంచండి. అన్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఝాన్సీ గోల మాట్లాడుతూ డైరెక్టర్ శ్రీకాంత్ గారు ఎంతో క్లారిటీగా ఈ సబ్జెక్ట్ నాకు చెప్పారు.

## బిల్లా రంగ బాష షూటింగ్ ప్రారంభం



**వుదయం సినిమా :** 'నాగబంధం సూపర్‌స్టార్ బాద్‌షా కిచ్చా సుదీప్ హీరోగా, విజనరీ అనుప్ భండారి దర్శకత్వం వహించిన ఈ చిత్రం, 2209 AD ఫ్యూచర్ లో సెట్ చేయబడిన ఇంతకు ముందెన్నడూ చూడని సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించనుంది. గ్రాండ్ స్కేల్ లో బిల్లా రంగ బాషా భారతీయ సినిమా నుంచి సైన్స్ ఫిక్షన్ కథ చెప్పడంలో ఒక అడ్వంచర్ జర్నీని సూచిస్తోంది. బ్లాక్‌బస్టర్ హనుమాన్ మేకర్స్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాణంలో అద్భుతమైన స్టార్ పవర్, టెక్నికల్ వాల్యూస్ లో ఈ సినిమా న్యూ బెంచ్ మార్క్ ని క్రియేట్ చేయనుంది. ఈ సినిమా షూ టిం గ్ నే టి నుంచి తిరిగి ప్రారంభం కానుంది. 'నిరీక్షణకు తెరపడింది... యుద్ధం మొదలవుతోంది' అని మేకర్స్ ఒక స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ గన్ పట్టుకొని ఇంటెన్స్ లుక్ లో కనిపించారు. ఈ లుక్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన కాన్సెప్ట్ వీడియో, లోగో రివీల్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చంది. చిత్రానికి సంబధించిన మరిన్ని ఎక్సయిటింగ్ అప్డేట్స్ మేకర్స్ త్వరలో తెలియజేయనున్నారు.

## 'హైకూ' చిత్రీకరణ పూర్తి..

**వుదయం:** 'కోర్ట్' సినిమాలో చక్కటి నటనతో తెలు గు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకున్న హీరోయిన్ శ్రీదేవి లేటెస్ట్ మూవీ 'హైకూ'. ఈ బహుభాషా చిత్రంలో శ్రీదేవితో పాటు ఏగన్, 'మిన్నల్ మురళి' మూవీ ఫేమ్ ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై డా. డి. అరుళానందు, మాథేవో అరుళానందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యువరాజ్ చిన్నసామి కథ, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాలుగు షెడ్యూళ్లలో 90 రోజుల చిత్రీకరణతో మొత్తం షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా...డైరెక్టర్ యువరాజ్ చిన్నసామి మాట్లాడుతూ, '''హైకూ' సినిమాను అనుకున్న ప్లానింగ్ ప్రకారం పూర్తి చేశాం. ఇది మా ఎంటైర్ టీమ్‌కు చాలా ఎమోషనల్, హ్యాపీ మూమెంట్. కథను నమ్మి నాకు పూర్తి క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చిన మా నిర్మాతలు డా. డి. అరుళానందుగారికి, మాథేవో అరుళానందు గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు. ఓ డైరెక్టర్ విజన్‌కు అండగా నిలిచే నిర్మాతలు దొరకడం అదృష్టం. ఆ విషయంలో నాకు నిర్మాతల నుంచి తిరుగులేని మద్దతు లభించడాన్ని మరచిపోలేను. వాళ్లు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని అనుకుంటున్నాం.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.